ఈనాడు
ఆదివారం
7 డిసెంబరు 2025



డబ్బు జబ్బులకు...
వెల్త్ సైకాలజిస్టులు!

మా ఆయన... మొదటి ముద్ద నాకే!



నయనతార... లేడీ సూపర్‌స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఈ మలయాళ కుట్టి... త్వరలోనే 'మన శంకర వరప్రసాద్‌గారు'లో మెగాస్టార్ చిరంజీవితో కలిసి మరోసారి తెలుగు తెరమీద సందడి చేయనుంది. అందులోని 'మీసాలపిల్ల' పాటతో ఇప్పటికే అలరించి, ఆకట్టుకున్న ఈ సొగసరి తనకు సంబంధించిన ఆసక్తికర విషయాల్ని పంచుకుంటోందిలా...

ఆ రోజు మర్చిపోలేను

ఇండస్ట్రీకి వచ్చి ఇరవైఏళ్లు గడిచి పోయినా, పెద్దపెద్ద నటులతో కలిసి నటించినా కొత్తలో చేసిన పొరపాట్లు నాకింకా గుర్తున్నాయి. ఓసారి నేనూ, మోహన్‌లాల్‌గారూ ఓ సినిమా చేస్తున్నాం. నా పాత్రకు చాలా డైలాగులు ఉన్నాయి. వాటిని వల్లెవేస్తూ హావభావాలను పలికించేందుకు తెగ కష్టపడిపోతున్నాను. మోహన్‌లాల్‌గారేమో మరింత బాగా ఉద్వేగాలు పండాలని పదేపదే చెబుతున్నారు. ఏం చేయాలో తోచలేదు. నావల్ల కావడంలేదని చెప్పాను. కాసేపటికి డైరెక్టర్ వచ్చి 'ఇవాళ్టికి బ్రేక్ తీసుకుందాం. ఏం చేయాలన్నది రేపు ఆలోచిద్దాం' అని చెప్పి నన్ను రక్షించారు. ఇంటికెళ్లాక కూడా, మర్నాడు చేయబోయే సీన్ల కోసం రాత్రంతా రిహార్సల్ చేశాను. నా శ్రమ ఫలించింది. నా నటనను అందరూ మెచ్చుకున్నారు.



పిల్లలతో కాసేపు

ఎంత అలసిపోయినా, పడుకునే ముందు పిల్లలు... ఉయిర్, ఉళగంల పక్కన చేరి రకరకాల విషయాలు చెబుతుంటా. వాళ్లు అప్పటికే పడుకున్నా సరే, నా కబుర్లు ఆపను. దీనికి నేను పెట్టుకున్న పేరు 'పాజిటివ్ స్లీప్ టాక్'. నిద్రలో ఉన్నప్పుడు కూడా, నా మాటల్ని వాళ్ల మనసులు వింటాయని బలంగా నమ్ముతాను.

నాకు పెట్టాకే తింటాడు!

నేనూ, మావారు విఘ్నేశ్ శివన్... రోజూ కలిసే భోంచేస్తాం. మొదటి ముద్ద నాకు తినిపించాకే తాను తింటాడు. ఏ విషయంలో అయినా గొడవపడినప్పుడు, నేను ముభావంగా ఉన్నా సరే, ఆ అలవాటు మాత్రం మానుకోడు. వద్దంటూ మూతి ముడిచినా... కాసేపు బతిమాలించుకుని, మాట్లాడకుండా తినేస్తా. నా కోపం తగ్గిందని అలా చెబుతానన్నమాట.

మీరా... వీరాభిమానిని

మాది కేరళలోని తిరువళ్ల. హీరోయిన్ మీరా జాస్మిన్‌దీ ఆ ఊరే. మా క్లాస్‌లో మీరా కజిన్ ఉండేది. తనెప్పుడూ మీరా జాస్మిన్ షూటింగ్ కోసం స్విట్జర్లాండ్ వెళ్లిందనో, సింగపూర్‌లో ఉందనో గొప్పగా చెప్పేది. అవన్నీ వింటూ తెలియకుండానే మీరా జాస్మిన్‌కు అభిమానిగా మారాను. క్రమంగా నాకూ ఇండస్ట్రీకి రావాలనే ఆలోచన కలిగింది. ఇన్నాళ్ల తర్వాత 'టెస్ట్' సినిమాలో కలిసి నటించే అవకాశం వచ్చింది. అప్పుడే, మొదటిసారి తనతో మాట్లాడాను.



మెగాస్టార్ నిరాడంబరుడు

అంత పెద్ద నటుడైనా, చిరంజీవి గారు చాలా నిరాడంబరంగా ఉంటారు. సెట్స్ మీద ప్రతి సమస్యనూ అర్థంచేసుకుని సలహాలు ఇస్తారు. నేను డాక్యుమెంటరీ తీస్తున్నానని తెలిసి, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌నూ అందించారు. వాళ్ల ఇంట్లోవాళ్లూ అంతే. చాలా సింపుల్‌గా ఉంటారు. ఆయనతో కలిసి నటించే అవకాశం ఎప్పుడు వచ్చినా వదులుకోను. త్వరలోనే మేమిద్దరం కలిసి 'మన శంకర వరప్రసాద్‌గారు'తో మళ్లీ మిమ్మల్ని అలరించబోతున్నాం.

రోజూ గుడికెళ్లేది

ఒకానొక సమయంలో వ్యక్తిగత సమస్యల కారణంగా బాగా ఒత్తిడికి లోనయ్యాను. నాన్న ఆరోగ్యమూ అంతంతమాత్రంగానే ఉండేది. అదంతా చూసి నేనేమైపోతానోనని అమ్మ భయపడి పోయింది. రోజూ పొద్దున్నే మా ఇంటికి దగ్గర్లో ఉన్న చెట్టికుళంగర ఆలయానికి వెళ్లి అమ్మవారిని పూజించేది. ఆ తర్వాత చర్చికీ వెళ్లేది.



నచ్చిన సినిమా

'కుచ్ కుచ్ హోతా హై'... మనసు బాలేకపోయినా, బాధల్లో ఉన్నా, విశ్రాంతి తీసుకోవాలన్నా ఆ సినిమా పెట్టుకుంటా. హాయిగా అనిపిస్తుంది.



ఇంటి భోజనమే ఇష్టం

ఒకప్పుడు డైటింగ్ పేరుతో నోరుకట్టేసుకునేదాన్ని. ఆ తర్వాత నిపుణుల సలహాతో ఇంటి భోజనం అలవాటు చేసుకున్నా. తీరిక ఉన్నప్పుడల్లా కిచెన్‌లో అడుగు పెడతా. టొమాటో పప్పు, చపాతీ, బిర్యానీ.. వంటివి చేస్తుంటా. వంటావార్పూ అమ్మ నుంచే నేర్చుకున్నా.

లోపల

మంచిమాట

చేసిన సాయాన్ని నీళ్ళమీద రాయి.
పొందిన సాయాన్ని రాతిమీద చెక్కు.

అదే కోరిక

రమేశ్: దేవుడికి అంతసేపు దణ్ణం పెట్టుకున్నావు. ఏం కోరుకున్నావేంటి?

సురేశ్: నేనెప్పుడూ నాకోసం ఏమీ కోరుకోను. అన్నీ మా అమ్మ కోసమే.

రమేశ్: సరే... మీ అమ్మ కోసమే అనుకో, ఏం కోరుకున్నావు?



సురేశ్: ఏముందీ... మా అమ్మకి ఓ అందమైన కోడల్ని చూపించమని అడిగా.



తల్లిదండ్రుల దగ్గర పిల్లల వయసూ, భార్య దగ్గర భర్త తెలివీ అస్సలు పెరగవు!

సిల్లీ పాయింట్

పని మధ్యలో కునుకుతీయడం జపాన్‌లో సాధారణమేనట. అంతేకాదు.. ఎక్కువ కష్టపడటం వల్లే వాళ్లకు ఆ విశ్రాంతి అవసరమైందనే పాజిటివ్ కోణంలో చూస్తారు.

★ ఈ ఏడాది అక్టోబరులో- వారం వ్యవధి లోనే అయిదు నోబెల్ బహుమతులు సాధించి రికార్డు సృష్టించింది ‘యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా’.

★ ఇప్పుడు మనం వాడే కీబోర్డ్‌ని టైపింగ్ వేగం తగ్గించేందుకు డిజైన్ చేశారట. అప్పట్లో టైప్‌రైటర్లు జామ్ కాకుండా ఉండటానికే అలా చేశారు.

★ ఉగాండాకు చెందిన కినెరాకు ఆరేళ్లున్నప్పుడు... కోర్టు గొడవల్లో కొంత భూమిని కోల్పోయిందతని కుటుంబం. దాంతో పట్టుదలతో లా కోర్సు చదివిన కినెరా, సొంతంగా వాదనలు వినిపించి మరీ 23 ఏళ్ల తర్వాత తమ భూమిని తిరిగి దక్కించుకున్నాడు.

★ జపనీయులు రెండు అంగుళాల మందంతో ఉండే ‘ఫుటాన్’ బెడ్లనే వాడుతుంటారు. వాటితో నడుం నొప్పి సమస్యలు 67 శాతం తగ్గిపోతాయట.

★ ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీకి పదకొండేళ్లప్పుడు గ్రోత్ హార్మోన్ సమస్య ఉన్నట్లు తేలింది. వాళ్లదేమో పేద కుటుంబం. దాంతో ‘బార్సిలోనా ఫుట్‌బాల్ క్లబ్’ అతడితో కాంట్రాక్టు కుదుర్చుకుని, వైద్య ఖర్చులనూ భరించింది.

★ అన్నింటికంటే బోర్లా తిరిగి పడుకోవడమే వెన్నెముకకు అత్యంత నష్టం కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

★ మొసళ్లు వేగంగా ముందుకు వెళ్లగలవు కానీ, పక్కకు తిరగాలంటే మాత్రం కష్టపడతాయట.

★ నలుపు చర్మంపైన తెల్లటి చుక్కలతో కెన్యాలో కనిపించి ఆశ్చర్యానికి గురి చేసిందో జీబ్రా.

★ ఆపకుండా 10,507 పుష్-అప్స్ చేసిన రికార్డు జపాన్‌కు చెందిన మినోరు యోషిదా అనే వ్యక్తి పేరిట ఉంది. ఇది ప్రమాదకరమైన ఫీట్ కావడంతో, ఒకేసారి కాకుండా 24 గంటల్లో ఎక్కువ పుష్-అప్స్ రికార్డుల్నే ‘గిన్నిస్’ ఇప్పుడు నమోదు చేస్తోంది.

★ పెంగ్విన్లు అన్నీ ఒకేసారి కాకుండా ముందుగా గుంపులో ఒక దాన్ని నీళ్లలోకి తోస్తాయట. ఆ నీళ్లలో తమకు హాని కలిగించే జీవులేమీ లేవని నిర్ధరించుకున్నాకే మిగతావి దిగుతాయట.

★ 17, 18 శతాబ్దాల్లో ఇప్పటిలా పైనాపిల్ విరివిగా దొరికేది కాదు. అందుకే, ఆ రోజుల్లో అతిథులు వచ్చినప్పుడు తమ దర్పానికి సూచికగా ఆ పండ్ల ముక్కలను పెట్టేవారు.

★ ‘సిగరెట్ బ్రేక్ వల్ల ఉత్పాదకత తగ్గిపోతోంది’ అంటూ కొందరు ఉద్యోగులు ఫిర్యాదు చేయడంతో, సిగరెట్ తాగని వారికి జీతంతో కూడిన ఆరు అదనపు సెలవులు ఇస్తామని ప్రకటించింది ఓ జపాన్ సంస్థ.



తండ్రిపైన తనకున్న ప్రేమను విభిన్నంగా చాటిందో కొలంబియా యువతి. ‘గ్రాడ్యుయేషన్ డే’ సందర్భంగా- తన తండ్రి బతికున్నప్పుడు ధరించిన అన్ని టైలనూ కలిపి కుట్టించిన స్కర్ట్ వేసుకొని డిగ్రీ పట్టా అందుకుందామె.

★ ‘హెడ్డాఫీసు నుంచి వస్తున్నాను. ఈ స్టోర్‌లో కస్టమర్లకు అందించే పదార్థాల నాణ్యతను పరిశీలించాలి’ అంటూ దక్షిణాఫ్రికాకు చెందిన ఓ విద్యార్థి ఏడాదిపాటు కేఎఫ్‌సీలో ఉచితంగా తినేశాడు.

బెర్ముడా వాసుల తాగు నీటికి వర్షాలే ఆధారం. అందుకే వాన నీటిని ఒడిసిపట్టేందుకు ఇళ్ల పైకప్పును మెట్ల మాదిరి నిర్మించు కుంటారక్కడ. ఇంకా ప్యూరిఫయర్‌లా పనిచేసే తెలుపు రంగూ వేస్తారు.



ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లను వేస్తే, కుక్కల ఆహారం ఇచ్చే వెండింగ్ యంత్రాలను తీసుకొచ్చింది టర్కీ. ఒకే దెబ్బతో అటు ప్లాస్టిక్‌కూ, ఇటు వీధి కుక్కల సమస్యకూ చెక్ పెట్టారన్నమాట.



ఫ్రాన్స్‌లోని బేకరీల్లో అమ్ముడుపోని బ్రెడ్‌ని అవసరమైన వాళ్లు తీసుకెళ్లేలా అక్కడి ‘పబ్లిక్ బాక్సు’ల్లో పెడుతుంటారు.



దక్షిణ అమెరికాలో కనిపించే ‘గ్రీన్ బార్డ్ వుడ్‌పెకర్’ పక్షుల ఈకల్లో హృదయాకార గుర్తులు కనిపిస్తాయి.




పూజలు ఎక్కువ చేస్తే...
కష్టాలూ ఎక్కువేనా?

దేవతారాధనలో చాలా పొరపాట్లు చేస్తుంటాం. ఆలయ సందర్శన, పూజావిధులకు సంబంధించి కూడా మనకు అనేక సందేహాలు ఉంటాయి. ఆ తప్పుల్ని సరిదిద్దుకునేందుకూ, ఆ సందేహాల్ని నివృత్తి చేసుకునేందుకూ ప్రయత్నిద్దామా...



ఆలయాన్ని కానీ, పుణ్యక్షేత్రాన్ని కానీ దర్శించుకున్నాక నేరుగా ఇంటికే వెళ్లాలని చెబుతారు. ఎందుకు?

ఆలయం ఆధ్యాత్మిక శక్తికి కేంద్రస్థానం. ఆ పరిసరాల్లో భక్తి తరంగాలు ప్రవహిస్తూ ఉంటాయి. పవిత్ర క్షేత్రాలకు వెళ్లినప్పుడు, ఆ దైవిక శక్తి మనల్ని ఆకర్షిస్తుంది. ఆ సానుకూల శక్తిని పెంచుకునేందుకే... ప్రశాంతమైన మనసుతో, ఆధ్యాత్మిక సంకల్పంతో దైవదర్శనానికి బయల్దేరతాం. ఆ వెంటనే, చుట్టపుచూపుగా అయినా సరే, ఎవరి ఇంటికో వెళ్లడం సరికాదు. ఆ శక్తిని స్వీకరించే స్థితిలో అవతలి వాళ్లు ఉండకపోవచ్చు. పైగా దైవదర్శనం తర్వాత నేరుగా ఇంటికి చేరుకోవడం వల్ల ఆ ప్రశాంత మనఃస్థితినీ, దైవ చింతననూ ఇంకాసేపు కొనసాగించినట్టూ అవుతుంది. ఇవన్నీ ఆలోచించే, మన పెద్దలు ఈ నియమం పెట్టి ఉంటారు.



గురుముఖం

◆ **పూజలు అధికంగా చేసేవారి కష్టాలు ఓ పట్టాన తీరవనీ, భగవంతుడు ఇంకా ఎక్కువగా పరీక్షిస్తాడనీ అంటారు. నిజమేనా?**

ఇది అపోహ మాత్రమే. కష్టసుఖాలు మన కర్మ ఫలితాలుగా లభిస్తాయి. సూర్యోదయం- సూర్యాస్తమయాల్లానే సుఖదుఃఖాలు కూడా ఒక చక్రంలా ఒకదాని తర్వాత మరొకటి పలకరిస్తూ ఉంటాయి. పూజల వల్ల వాటిని తట్టుకుని నిలబడి, ధైర్యంగా పోరాడే సానుకూల శక్తి వస్తుంది. ఆత్మవిశ్వాసం, మనోబలం పెరుగుతాయి. అంతేతప్ప పూజలు చేస్తే మరిన్ని కష్టాలు వచ్చేయవు, పూర్తిగా తొలగిపోవూ. అలాగని, విపరీతంగా కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యాలు పెట్టి అదేపనిగా ఉపచారాలు చేయడం కూడా మూఢభక్తి కిందికి వస్తుంది. దీన్నే 'రావణపూజ' అంటారు. పరమేశ్వరుడికి సైతం అసహనం కలిగేంత తీవ్రంగా రావణుడు పూజించాడు కాబట్టే దానికి ఆ పేరు వచ్చింది. ప్రశాంతమైన చిత్తంతో పూజించి పరమాత్ముడి అనుగ్రహాన్ని పొందేందుకు ప్రయత్నించాలి.

◆ **చనిపోయినవారి ఫొటోలను పూజగదిలో పెట్టకూడదా?**

అది అపోహే. దేవతల్ని ఎంతో భక్తితో అర్చిస్తాం. పితృదేవతల శ్రాద్ధ కర్మల్ని కూడా అంతే శ్రద్ధగా నిర్వహిస్తాం. ఈ రెండు కార్యాలూ పూర్తిగా వేరువేరు. పెద్దలకు ఉత్తమలోకాలు ప్రాప్తించాలన్నది వారసులుగా మన సంకల్పం కూడా. అందుకే నిస్సందేహంగా వాళ్ల చిత్రపటాలను దేవతా గృహంలో పెట్టుకోవచ్చు. అయితే, వాటిని దక్షిణం వైపే తగిలించాలి. అలానే, అతి సర్వత్ర వర్జయేత్ అనీ మరువకూడదు. ఆ ఫొటోలు మరీ పెద్దగా ఉండకూడదు.


– ఆచార్య కాకునూరి సూర్యనారాయణమూర్తి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త

పరిశోధన

నల్ల జీలకర్ర ఎంతో మేలు



సూపులూ, బ్రెడ్‌లపైన చల్లుకునే నల్లటి కలోంజి గింజలు తెలుసు కదా! ఇవి వంటకాలకి రుచిని తీసుకురావడమే కాకుండా, రక్తంలోని చెడు కొవ్వుని తగ్గించి- గుండె జబ్బులు రాకుండా చూస్తాయట. నల్ల జీలకర్ర లేదా నైజెల్లా అని కూడా పిలిచే ఈ గింజలని రోజువారీ ఆహారంలో సుమారుగా ఓ ఐదు గ్రాముల వరకూ చేర్చుకుంటే ఎనిమిది నుంచి పదివారాల లోపే రక్తంలోని చెడుకొవ్వు తగ్గుముఖం పడుతుందని అంటున్నారు జపాన్‌లోని ఒసాకా మెట్రోపాలిటన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. పరిశోధనలో భాగంగా కొంతమంది ఊబకాయులకు నల్ల జీలకర్ర గింజల్ని ఆహారంలో భాగం చేశారు. ఎనిమిది వారాల్లోనే ఆ వ్యక్తుల్లో ట్రైగ్లిజరాయిడ్లూ, అంతర్గత వాపులూ తగ్గడంతోపాటు బరువు కూడా నియంత్రణలోకి రావడం గమనించారు. ఈ గింజల్లోని థైమోక్వినోన్ అనే శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్‌కి శరీరంలో కొవ్వు పేరుకోకుండా చేసే శక్తి ఉందని ఈ పరిశోధనల్లో తేలింది. అయితే జీవనశైలి మార్పులూ, ఆరోగ్యకరమైన ఆహారం, తగిన వైద్య సలహాలూ తోడైనప్పుడే వారిలో ఈ ఫలితాలు పూర్తిగా లభిస్తాయట.



బొద్దింకలతో గాలి కాలుష్యమా?

ఇండోర్ ఎయిర్ పొల్యూషన్ అనగానే సాధారణంగా మనకు... వంటింట్లోంచి వెలువడే పొగా, అగరొత్తులూ ధూప్‌స్టిక్స్ వంటివి విడుదల చేసే పొగలూ కళ్లముందు మెదులుతాయి. ఇవే కాకుండా కృత్రిమ పరిమళాలు.. అంటే పర్‌ఫ్యూమ్‌లూ సెంటెడ్ క్యాండిల్స్ వంటివి కూడా ఇంటి కాలుష్యాన్ని పెంచుతాయని శాస్త్రవేత్తలు తేల్చారు. వీటన్నింటితోపాటు బొద్దింకలు సైతం ఇంట్లోని గాలిని కలుషితం చేస్తాయని హెచ్చరిస్తున్నారు అమెరికాలోని నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. బొద్దింకల విసర్జితాల నుంచి వెలువడే ఎండోటాక్సిన్స్‌లో హానికారక బ్యాక్టీరియా ఉంటుందట. ఇది ఇంట్లోని దుమ్మూ, ధూళితో కలిసిపోయి గాలిని కలుషితం చేసి- అలర్జీలూ, ఆస్తమా, ఇతర శ్వాసకోశ వ్యాధుల వ్యాప్తికి కారణం అవుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. కాబట్టి 'తక్కువే ఉన్నాయి కదా! వాటి వల్ల ఏం ఇబ్బంది వస్తుందిలే...' అని రాజీ పడకుండా వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం చాలా అవసరం. లేకుంటే ప్రాణాంతక వ్యాధులబారిన పడాల్సి వస్తుంది.

ఆదాయం తగ్గితే... మతిమరుపు!





వయోధికుల్లో మతిమరుపు లక్షణాలు కనిపించినప్పుడు 'ఈ వయసులో సహజమే కదా!' అని సరిపెట్టుకుంటాం. ఎందుకంటే, వయసూ, జన్యువులూ మాత్రమే జ్ఞాపకశక్తిని ప్రభావితం చేస్తాయని బలంగా నమ్ముతాం. కానీ, నడివయసులో తీసుకునే కొన్ని జాగ్రత్తలు వృద్ధాప్యంలో వచ్చే మతిమరుపుని తొమ్మిదిశాతం వరకూ తగ్గిస్తాయని అంటున్నారు అమెరికాకి చెందిన థామస్ జెఫర్‌సన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఇందుకోసం 13 వేలమందికి సంబంధించిన సామాజిక, ఆర్థిక చరిత్రతోపాటు జీవనశైలి అలవాట్లనూ అధ్యయనం చేశారు. నడివయసులో విరుచుకుపడే ఊబకాయం, ఒంటరితనం, దృష్టి దోషాలు వంటి రుగ్మతలకు తోడుగా ఆదాయం తగ్గిపోవడం కూడా మతిమరుపు సమస్యకు ఓ ప్రధాన కారణమని ఆ పరిశీలనలో తేలింది. రాబడి తగ్గడం వల్ల కలిగే ఆందోళన, ఒత్తిడి కూడా డిమెన్షియాకి దారితీస్తాయని శాస్త్రవేత్తలు తేల్చారు. అందుకే నడివయసులోనే వ్యాయామానికీ, ఆరోగ్యకరమైన ఆహారానికీ తగినంత ప్రాధాన్యం ఇవ్వాలి. అధిక రక్తపోటును నియంత్రించుకోవాలి. కంటి సమస్యల్ని నిర్లక్ష్యం చేయకూడదు. సరైన ఆర్థిక ప్రణాళికనూ రచించుకోవాలి. ఈ ముందు జాగ్రత్తలతో డిమెన్షియాని 9 శాతం వరకూ నియంత్రించవచ్చట.

కళ్లు చూసి చెప్పేస్తారు...

ఇతరుల కళ్లలోకి సూటిగా చూసినప్పుడు మీకేం అర్థం అవుతుంది? ఎర్రగా ఉంటే కోపంగా ఉన్నారనీ, కాస్త తడిగా ఉంటే ఎందుకో బాధపడుతున్నారనీ అనుకుంటాం. అంతకు మించి ఇంకేమీ తెలుసుకోలేం. కానీ సింగపూర్ శాస్త్రవేత్తలు మాత్రం... ఒక మనిషి కళ్లలోకి చూసి వారికి భవిష్యత్తులో రాబోయే గుండె జబ్బులూ, కిడ్నీ వ్యాధులూ, అల్జీమర్స్, డయాబెటిస్ గురించి కూడా అర నిమిషంలో చెప్పేయగలరు. అదెలా సాధ్యం... అనుకుంటున్నారు కదూ! అవును, ఇదంతా ఏఐ మహిమే. కంటిలోని రెటీనాని స్కాన్ చేసి దాని రంగు, రక్తనాళాలు, కండరాలు, కణాల ఆరోగ్య పరిస్థితి ఆధారంగా శరీరంలోని ఇతర సమస్యల గురించీ ఓ అంచనాకు రావచ్చు. ఈ విధానాన్ని 'ఓక్యులోమిక్స్' అంటారు. సింగపూర్ నేషనల్ ఐ సెంటర్, డ్యూక్ ఎన్‌యూఎస్ మెడికల్ స్కూల్ శాస్త్రవేత్తలు ఈ విధానానికే ఏఐ టెక్నాలజీని జోడించారు. ఇందుకోసం బ్రిటన్‌లోని యూకే బయోబ్యాంక్ నుంచి 5 లక్షల మంది వలంటీర్ల డేటాను తీసుకుని ఈ ఏఐ- ఓక్యులోమిక్స్ విధానాన్ని రూపొందించారు. ఈ పద్ధతిలో అతి తక్కువ సమయంలోనే భవిష్యత్తులో రాబోయే వ్యాధులని పసిగట్టేయొచ్చు.







నీటి కరవుకు... 'చెక్' పెట్టాడు!

నెర్రెలు బారిన నేలలు, తడారిన బావులు, ఎండిపోయిన పంటలు... ఒకప్పుడు ఆ కరవు నేలల్లో కనిపించిన దృశ్యాలివి. అయితే ఒక వ్యక్తి తనదైన జల వ్యూహంతో ఆ బీడు భూములకూ నీళ్లు అందించాడు. చెక్‌డ్యాములు, సేద్యపు కుంటలు, కాలువగట్ల నిర్మాణంతో... లక్షలాది రైతుల కష్టాలు తీర్చాడు. వాటర్‌షెడ్ కమిటీలతో సంపదలు పెంచి దక్షిణాది జలయోధుడిగా పేరుతెచ్చుకున్నాడు. ఇటీవల ప్రతిష్ఠాత్మకమైన జలశక్తి అవార్డును అందుకున్న పొదిలి రాజశేఖరరాజు ప్రయాణం ఇది...



ఆ ఊరి పేరు కొక్కెర కొండాయిపాలెం. ప్రకాశం జిల్లాలోని ముండ్లమూరు మండలంలో ఉంది. ఒకప్పుడు తీవ్ర కరవు గ్రామం. పొదిలి రాజశేఖరరాజుదీ ఆ పల్లెటూరే. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ చేతిపంపు నుంచి బిందెల కొద్దీ నీళ్లు మోసుకురావడమే... తన బాల్యానికి సంబంధించిన తొలి జ్ఞాపకమని చెబుతాడు రాజశేఖర్. ఆ కొద్దిపాటి నీళ్లతోనే ఇంటి అవసరాలు తీరాలి, పశువుల గొంతులు తడవాలి. రాజశేఖర్ తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయ కూలీలే. ఆ కుటుంబానికి ఎకరం పైచిలుకు మెట్ట పొలం ఉండేది. వర్షాభావ పంటలైన మినుములు, నువ్వులు వేసేవారు. ఒకసారి కృష్ణా కాలువ నుంచి ఆరుతడి నీళ్లిస్తారని ప్రచారం జరగడంతో, ఆశగా వరిపంట వేశారు. చివరికి నీళ్లు రాలేదు. ఎప్పట్లాగే వర్షం కూడా ముఖం చాటేసింది. దీంతో కళ్లముందే పంట ఎండిపోయింది. 'ఆ ఎండిన పంటని చూసి మా నాన్న కన్నీరుపెట్టుకోవడం నన్ను కదిలించింది. ఎలాగైనా, నాన్నలాంటి బక్క రైతుల నీటి కష్టాలు తీర్చాలని బలంగా నిర్ణయించుకున్నాను' అంటాడు రాజశేఖర్. అప్పటికి తను ఇంటర్ చదువుతున్నాడు. ఆ తర్వాత తెనాలిలో బీఎస్సీ చేశాడు. నీటి నిర్వహణపైన పట్టు సాధించాలనే సంకల్పంతో అహ్మదాబాద్‌లోని 'ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'లో పీజీ డిప్లొమా కోసం దరఖాస్తు చేశాడు. కానీ, అక్కడ ఫీజులు చాలా ఎక్కువ. రెండేళ్ల కోర్సుకు రూ.1.20 లక్షలు! స్నేహితులు, ఆత్మీయులు చందాలు వసూలు చేసి మరీ అహ్మదాబాద్ పంపారు. వాళ్లంతా తనపైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయలేదు రాజశేఖర్. నీటి అభివృద్ధి పథకాల అమలులో పట్టు సాధించి, జల నిపుణుడిగా క్యాంపస్ నుంచి బయటికొచ్చాడు. తెలుగు రాష్ట్రాల్లోని పల్లెటూళ్లలో పనిచేయాలన్న లక్ష్యంతో తెనాలికి చెందిన 'ఎఫర్ట్స్' అనే స్వచ్ఛంద సంస్థలో చేరాడు.



వాటర్‌షెడ్ పథకం

అప్పట్లో కేంద్ర ప్రభుత్వం, జాతీయ వ్యవసాయ-గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) కలిసి వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చాయి. దాదాపు వందకోట్ల ప్రాజెక్టు అది. నిధులైతే ఉన్నాయి కానీ గ్రామీణస్థాయిలో వాటిని చిత్తశుద్ధితో అమలు చేసేవారే లేకుండా పోయారు. రాజశేఖర్ తమ ఎన్జీఓ ద్వారా ఆ బాధ్యతని తీసుకున్నాడు. నాటి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకి ప్రాజెక్టు ఇన్‌ఛార్జిగా రంగంలోకి దిగాడు. ఎంత కరవునేల అయినా ఏదో ఒకరోజు వర్షమంటూ పడకమానదు. పిల్లకాలువలు పొంగిపొర్లకా మానవు. మరే జలవనరూ లేని కరవు ప్రాంతాల్లో... ఆ చిన్న కాలువలకి అడ్డుకట్ట (చెక్ డ్యాముల ద్వారా) వేసి, ప్రవాహాన్ని మళ్లించే కరకట్టలు కందకాలు తవ్వి, ఆ నీటిని నిల్వచేయడానికి సేద్యపు కుంటలు ఏర్పాటు చేయడమే వాటర్‌షెడ్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. దాన్నే తొలిసారిగా నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలంలోని నందిపాడులో అమలు చేశాడు రాజశేఖర్.

మారిన ముఖచిత్రాలు...

వాటర్‌షెడ్ పథకం కింద ప్రతి గ్రామానికీ కోటి రూపాయలొస్తాయి. గ్రామస్థులతో ఓ కమిటీని ఏర్పాటు చేసి... ఆ నిధులు అప్పగిస్తారు. మొదట్లో, ఆ విషయం అర్థంకాక 'మా పేరు చెప్పుకుని సర్కారు డబ్బులు తినడానికొచ్చారా?' అంటూ రాజశేఖర్ బృందంతో గొడవకు దిగేవారు అమాయక పల్లెవాసులు. చాలాచోట్ల గ్రామ కమిటీలో ఎవరెవరు ఉండాలన్న విషయంలో పట్టింపులకి వెళ్లి... ఆ కోపతాపాలు వీళ్లపైన చూపేవారు. రాత్రంతా గదిలో బంధించిన సందర్భాలూ ఉన్నాయి. 'ఆ ప్రజలే వాళ్ల ఊరికి జలకళ వచ్చాక... పల్లకీలో ఊరేగించారు' అని నవ్వుతూ చెబుతాడు రాజశేఖర్. అలా తన 20 ఏళ్ల కెరీర్‌లో 250 గ్రామాల ముఖచిత్రాలు మార్చేశాడు తను. సుమారు రెండు లక్షల రైతు కుటుంబాల సంపదని పెంచాడు. సుమారు 50 లక్షల ఘనపు మీటర్ల జల వనరుల్ని సృష్టించగలిగాడు. మొదట నాబార్డ్ తరపున ఆంధ్రప్రదేశ్ దక్షిణ కోస్తా జిల్లాలకే పరిమితమైనా, తర్వాత వివిధ కంపెనీల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) విభాగాలతో సమన్వయం చేసుకుని... ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లా మైలవరం, తెలంగాణలోని సూర్యాపేట ప్రాంతాల్లోనూ సేవలందించాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దు గ్రామాలకి జలకళ తెప్పిస్తున్నాడు! రాజశేఖర్ అంతర్జాతీయ గ్రీన్‌టెక్ అవార్డునీ, కేంద్ర ప్రభుత్వం నుంచి 'వాటర్ హీరో' పురస్కారాన్నీ అందుకున్నాడు. తాజాగా జలశక్తి వ్యక్తిగత అవార్డూ వరించింది. ఈ ఏడాది దక్షిణాది నుంచి ఆ గౌరవాన్ని అందుకున్న ఏకైక వ్యక్తి... రాజశేఖరే కావడం మరో విశేషం! ★



'సైకో పార్క్' చూశారా?



పేరు చూసి భయపడకండి. ప్రపంచంలోనే మొట్టమొదటి సైకాలజీ పార్క్ ఇది. 'నన్ను అంతా ముక్కోపి అంటున్నారు, కారణం ఏమిటి? ప్రతి పనినీ ఎందుకిలా వాయిదా వేస్తున్నాను? నా పిల్లలు మొబైల్‌కి అతుక్కుపోతున్నారు, అదేమైనా వ్యసనమా?' ఇలాంటి ప్రశ్నలకు ఈ మ్యూజియం శాస్త్రీయమైన జవాబులు చెబుతుంది. అలా అని, ఇదేమీ మానసిక చికిత్సాలయం కాదు. మనసుకి సంబంధించిన అనేక విషయాలను వినోదాన్ని రంగరించి మరీ విడమరిచి చెప్పే వినోద-విజ్ఞాన కేంద్రం. కేరళ రాజధాని తిరువనంతపురానికి 20 కిలోమీటర్ల దూరంలోని వెల్లనాడు అనే చోట ఉందీ సైకో పార్క్. ఇందులో సినిమా సన్నివేశాల ద్వారా మానసిక సమస్యల్ని వివరించే ప్రత్యేక థియేటర్‌ను ఏర్పాటు చేశారు. డోపమైన్ హౌస్, బ్రెయిన్-మైండ్ మ్యూజియం తదితర విభాగాలూ ఉన్నాయి. కేరళకి చెందిన ప్రసిద్ధ సైకాలజిస్టు మధుజన్ దీని రూపకర్త. ఆటపాటల ద్వారా మన మనసు లోతుల్ని వివరించడానికి పదిమంది సైకాలజిస్టులు సిద్ధంగా ఉంటారు!



వీఐపీల టిఫిన్ సెంటర్

చూడ్డానికి పాతకాలపు ఇడ్లీ కొట్టులా కనిపిస్తుందా హోటల్. అక్కడ రోట్లోనే పిండి రుబ్బుతారు. కట్టెలపొయ్యి మీదే టిఫిన్లు వండుతారు, ఇడ్లీ, దోసె, వడలు... ఏవైనా సరే పది రూపాయలే. అయితేనేం, తమిళ చిత్రసీమకు చెందిన వీఐపీలు ఆ టిఫిన్లకు వీరాభిమానులు. కమల్‌హాసన్ చెన్నైలో ఉంటే మాత్రం, వారంలో రెండు రోజులైనా ఇక్కడి అడై(పప్పు ధాన్యాలతో చేసే దోసె) రుచి చూడాల్సిందే. స్టార్ హీరో విజయ్ షూటింగ్‌లకు ఈ హోటల్ నుంచే టిఫిన్లు సరఫరా చేస్తారు. హాస్య నటుడు వడివేలు, దర్శకుడు ఏఆర్ మురుగదాస్ వంటివాళ్లకీ ఈ హోటల్ నుంచే బ్రేక్‌ఫాస్ట్ వెళ్తుంది. ఈ 'తిరునెల్వేలి వెజ్ హోటల్' కోడంబాక్కం ప్రాంతంలోని శాలిగ్రామంలో ఉంది. అరవైలలో తిరునెల్వేలి ప్రాంతానికి చెందిన శంకరన్ దీన్ని స్థాపించారు. ప్రస్తుతం ఆయన మనవళ్లు నడుపుతున్నారు. దగ్గర్లోనే ప్రసాద్ ఆడియో రికార్డింగ్ స్టూడియో ఉంటుంది. దీంతో 1970ల నుంచే ప్రసిద్ధ సంగీతదర్శకుడు ఇళయరాజా ఇక్కడి టిఫిన్‌కి వీరాభిమానిగా మారిపోయారు. ఆయనకు 'కల్' దోశ అంటే మహా ఇష్టమట.




అవీ ఇవీ

సైన్యానికి 'ఎలుక' సాయం

కంబోడియా... థాయ్‌లాండ్, వియత్నాంల మధ్య ఉన్న దేశం. వియత్నాం 1985-89 ప్రాంతంలో కంబోడియాని చేజిక్కించుకుంది. థాయ్‌లాండ్ సైన్యం లోపలికి ప్రవేశించకుండా సరిహద్దుల్లో పెద్ద ఎత్తున మందుపాతర్లని పెట్టింది. యుద్ధం ముగిసినా ఆ పాతర్లు అలాగే ఉండిపోయాయి. అడుగువేస్తే పేలిపోతాయి కాబట్టి... వాటిని తీయడం మానవమాత్రులకి అసాధ్యం. ఆ ప్రయత్నంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు కూడా. ఈ సమస్య పరిష్కారం కోసం 'అపోపో' అనే స్వచ్ఛంద సంస్థ ఓ వినూత్నమైన ఆలోచన చేసింది. ఆఫ్రికాలోని 'జెయింట్ పౌచ్డ్' రకం ఎలుకలకి మందుపాతర్లని వాసనతో పసిగట్టి, నిర్వీర్యం చేయడం నేర్పించింది. అలా తర్ఫీదు పొందిన 75 ఎలుకల్ని అక్కడి ప్రభుత్వానికి అందించింది. 'హీరోర్యాట్స్' పేరుతో అవి సైన్యంలో భాగమైపోయాయి. వాటిల్లోనూ రోనిన్ అనే ఎలుక ఏకంగా 109 మందుపాతర్లని నిర్వీర్యం చేసి గిన్నిస్ రికార్డు కూడా సాధించింది!









అది... హనుమాన్ పంచాయతీ

ఆ ఊళ్లో కొంతకాలం క్రితం ఓ పెళ్లి జరిగింది. ఆ సందడిలో పెళ్లివారి బ్యాగు దొంగతనానికి గురైంది. అందులో విలువైన నగలున్నాయి. 'పోలీసులకి చెబుదాం?' అన్నారు ఆ ఊరి గురించి తెలియనివారెవరో. 'అక్కడికెళితే ఆలస్యమవుతుంది. ఆంజనేయుడికి చెబుదాం' అన్నారు మిగతావాళ్లు. అలా అందరూ 'తేక్రామ్ హనుమాన్' గుడికెళ్లారు. బ్యాగు పోగొట్టుకున్నవాళ్లు తమకి ఎవరిపైన అనుమానం ఉందన్నది చెప్పారు. అతణ్ని పిలిపించి, హనుమంతుడి ముందు తన నిర్దోషిత్వాన్ని చాటుకుంటూ ప్రమాణం చేయమన్నారు. మొదట కుదర్దన్నాడు. అంతా పట్టుబట్టేసరికి హనుమంతుడి ముందు చేతులు జోడించి నేరం ఒప్పేసుకుని బ్యాగు తిరిగి ఇచ్చేశాడు. సమస్య గంటలో పరిష్కారం అయిపోయింది! మధ్యప్రదేశ్ భిండ్ జిల్లాలోని కత్రోల్ గ్రామంలో గత 250 ఏళ్లుగా ఇదే ఆచారం. ఆ ఊళ్లో దొంగతనాలు జరిగినా, భూ వివాదాలైనా తేక్రామ్ హనుమంతుడి వద్దకే పంచాయతీ వెళ్తుంది. తమ గొడవని వివరించి ప్రమాణాలు చేస్తారు. తప్పుడు ప్రమాణం చేసినవాళ్లనే కాదు, వాళ్ల కుటుంబసభ్యులనీ, వారసుల్నీ కూడా దేవుడు శిక్షిస్తాడన్న విశ్వాసం ఉంది. దీంతో ఎవరూ అబద్ధాలాడరట. అందువల్లనే... దగ్గర్లోని పోలీసు స్టేషన్‌కి ఒక్క ఫిర్యాదూ వెళ్లడం లేదట.

అదృష్టం వరిస్తుంది. పరిస్థితులు కలిసొస్తాయి. ఎలా అయితేనేం... సామాన్యుడు సంపన్నుడు అవుతాడు, సంపన్నుడు కుబేరుడు అవుతాడు. అలా అని, అంతటితో సమస్యలన్నీ పరిష్కారం అయిపోవు. కొన్ని అవుతాయి, మరికొన్ని పుట్టుకొస్తాయి. ఆ కొత్త సవాళ్లను ఎదిరించడానికి పాత ఆలోచనా విధానం పనికిరాదు. సరికొత్త మైండ్‌సెట్ అవసరం. 'వెల్త్ సైకాలజిస్టులు' ఆ పాఠాలు బోధిస్తారు. కాబట్టే పెరిగిపోతున్న శ్రీమంతుల సంఖ్యతో పాటే, ఆ డబ్బు డాక్టర్ల అవసరమూ పెరుగుతోంది.

డబ్బు జబ్బులకు... వెల్త్ సైకాలజిస్టులు!



ఒక దశ వరకూ, చాలా సమస్యలకు డబ్బే పరిష్కారంలా అనిపిస్తుంది. సంపద పెరిగేకొద్దీ డబ్బు కూడా ఓ సమస్యగా మారుతుంది. విల్లా హౌస్, ఫామ్ హౌస్, పెద్ద కారు, బ్యాంక్ బ్యాలన్స్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్స్... అన్నీ ఉంటాయి. అయినా, తెలియని ఆందోళన. ఇదీ అని చెప్పలేని వెలితి. ఈ 'ఫైనాన్షియల్ యాంగ్జయిటీ' కొత్త సంపన్నుల నుంచి తరాల కుబేరుల వరకూ అందర్నీ వేధిస్తోంది. మూల కారణం ఒకటే అయినా, ఆ ప్రభావాలు మాత్రం వేరువేరుగా ఉంటాయి. సంపద స్థాయిని బట్టి ఆ తీవ్రత మారిపోతూ ఉంటుంది.

'కొత్త కుబేరుల' భయాలు

ఎంత సంపాదించినా... సరిపోతుందా? - అనే సందేహం. సరిపోదేమో? - అనే అనుమానం. సమస్యలు వస్తే? - అనే భయం, హఠాత్తుగా వీధిపాలైతే? - అనే అభద్రత. అన్నీ కలిసి నయా సంపన్నులకు నరకం చూపిస్తున్నాయి. తాత ముత్తాతలతో పోలిస్తే వీళ్లంతా ఆర్థికంగా చాలా మెట్లు పైనే ఉంటారు. అయినా సరే, పుట్టుకతో వచ్చిన 'పోలిక వ్యాధి' స్థిమితంగా ఉండనీయదు. ఒకప్పుడు, సంపద అనేది పూర్తిగా వ్యక్తిగతం. కొన్నిసార్లు పరమ రహస్యం కూడా. సామాజిక మాధ్యమాలు ఆ తెరను చించిపడేశాయి. 'ఎగ్జిబిషనిజం' ఎక్కువైపోయింది. కొత్తింట్లో గృహప్రవేశం చేయగానే... ఆ ఫొటోల్ని ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేయాల్సిందే. ఆ గేటెడ్ కమ్యూనిటీలోని సౌకర్యాల్నీ విలాసాల్నీ వర్ణించి చెప్పాల్సిందే. కొత్త కారు కొనగానే... ఫ్యామిలీతో లాంగ్‌డ్రైవ్‌కు వెళ్తున్న రీల్స్ ఇన్‌స్టాలో షేర్ చేయాల్సిందే. బట్టలైనా, బంగారమైనా, ఎలక్ట్రానిక్ ఉపకరణాలైనా... వీకెండ్ షాపింగ్ గురించి నలుగురితో కథలు కథలుగా చెప్పుకోవాల్సిందే. ఆన్‌లైన్‌లో ఆ ఆత్మీయుల హంగామాను చూడగానే... మిగిలిన వారిలో ఫోమో (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్) ఫోబియా మొదలైపోతుంది. బంధువులతోనో సహోద్యోగులతోనో పోల్చుకుంటే, సంపాదించాల్సినంతగా సంపాదించలేక పోతున్నామనే 'ఆర్థిక ఆందోళన' ఎక్కువైపోతుంది. 'ఏడాదికి పాతిక లక్షలు సంపాదిస్తున్న వారిలోనూ... దాదాపు 74 శాతం మంది తమ ఎదుగుదల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు' అని వెల్లడించింది ఎకనమిక్ టైమ్స్-వెల్త్ తాజా సర్వే. కోటి రూపాయలకుపైగా ఇన్వెస్ట్‌మెంట్స్ ఉన్నవారు సైతం తమ ఆర్థిక ప్రణాళిక ఏమంత మెరుగ్గా లేదని కుమిలిపోతున్నారని డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ సర్వేలో తేలింది. వీళ్లలో చాలా వరకూ నలభై నుంచి యాభై ఏళ్లలోపు 'కార్పొరేట్' జీవులే. పైపైకి ఇదంతా అర్థంలేని ఆందోళనలా అనిపించినా, సమస్య మూలాలు మాత్రం బలమైనవే. వాళ్లంతా ఖరీదైన జీవనశైలికి అలవాటుపడి పోయారు. రాబడితోపాటే ఖర్చులూ పెరిగాయి. ఆ సౌకర్యాల్లో ఏ ఒక్కటి తగ్గినా వెలితిగా అనిపిస్తుంది. ఏ కారణం వల్ల అయినా పరిస్థితులు తారుమారైతే, జీవితాన్ని మళ్లీ సున్నా నుంచి మొదలు పెట్టాల్సి వస్తుందనే భయం కొత్త సంపన్నులను ఒత్తిడికి గురి చేస్తోంది. మార్కెట్ మందగమనం కారణంగా, రియల్ ఎస్టేట్ నుంచి స్టాక్ మార్కెట్ వరకూ ఎక్కడా... స్థిరమైన రాబడులు లభించడం లేదు. పొరపాటున సలహా అడిగితే... ఒకరేమో, తక్షణం పెట్టుబడులను వెనక్కి తీసేసుకోమంటారు. మరొకరేమో, ఆరునూరైనా సరే కొనసాగించమంటారు. ఇంకొకరేమో, ఇంకొంత ఇన్వెస్ట్ చేసి 'యావరేజ్' చేసుకోమంటారు. ఎవరి మాటలు నమ్మాలో తెలియదు. ఎవరి సూచనలు పాటించాలో అర్థంకాదు. కొలువుల విషయంలోనూ అదే సందిగ్ధత. ఉద్యోగం ఉంటుందో తెలియదు, ఊడుతుందో తెలియదు. 'ఏం చేద్దాం?' అనే ప్రశ్న ప్రతినిత్యం వెంటాడుతూ ఉంటుంది. నిద్రలోనూ వేధిస్తూ ఉంటుంది. ఈ తరహా 'డెసిషన్ పెరాలసిస్' మనిషిని గందరగోళానికి గురి చేస్తోంది. గుండెల్లో నిరాశావాదాన్ని నింపుతుంది. డిప్రెషన్ వైపుగా లాగేస్తుంది. మాట సాయం కోసం కౌన్సెలర్లను ఆశ్రయించినా, ఏమంత ఆర్థిక నైపుణ్యంలేని ఆ నిపుణుల సూచనలు అసంతృప్తినే మిగులుస్తున్నాయి. డబ్బు స్వభావమూ, మనసు లోతులూ... రెండూ తెలిసినవారు మాత్రమే తమలోని అనిశ్చితిని దూరం చేయగలరని ఆలస్యంగా అయినా అర్థం చేసుకుంటున్నారు కొత్త కుబేరులు.

శ్రీమంతుల కష్టాలు

కొన్ని జీవితాలు రాత్రికి రాత్రే మారిపోతాయి. లాటరీ రూపంలో భాగ్యలక్ష్మి కోట్లు కురిపిస్తుంది. దూరపు బంధువు వీలునామా పుణ్యమాని ఖరీదైన కమర్షియల్ కాంప్లెక్స్ చేతికి వచ్చేస్తుంది. కొత్తగా ఆరంభించిన స్టార్టప్‌ను ఏ బహుళజాతి సంస్థో గంపగుత్తగా కొనేస్తుంది. అంతవరకూ బాగానే ఉంది. కానీ, అనూహ్యంగా వచ్చిపడే ఐశ్వర్యాల్ని జాగ్రత్తగా కాపాడుకోవడం ఏ 'ఇన్‌స్టంట్ కరోడ్‌పతి'కైనా అతిపెద్ద సవాలే. దీన్నే 'సడన్ వెల్త్ సిండ్రోమ్' అంటారు. సంపదలు సృష్టించే సమస్యలు చిన్నవేమీ కాదు. ఖరీదైన వ్యసనాలు తోడవుతాయి.

చుట్టూ ఎవరెవరో వచ్చి చేరతారు. మరికొందరికి, ఇందుకు విరుద్ధమైన చేదు అనుభవాలూ ఎదురవుతాయి. వ్యాపారంలో ఊహించని నష్టాలు వస్తాయి. భాగస్వాములు నిండా ముంచేస్తారు. కోర్టు వ్యాజ్యాల వల్ల ఆస్తిపాస్తులు దాయాదుల పాలు అవుతాయి. ఆ దెబ్బకు నిస్పృహ ఆవరిస్తుంది, మనిషిలో పోరాట పటిమ తగ్గిపోతుంది.

ఈ రెండు సందర్భాల్లోనూ మనీ మేనేజ్‌మెంట్ ఎంత అవసరమో, మైండ్ మేనేజ్‌మెంట్ అంతకంటే ముఖ్యం. ఆర్థిక-మనస్తత్వ శాస్త్రాల మీద పట్టు ఉన్నవారే, సరైన పరిష్కారం చూపగలరు.

'సంపద' సైకాలజిస్టులు...

చేతినిండా డబ్బు ఉన్నప్పుడైనా, చేతులు కాల్చుకున్నప్పుడైనా... ఆర్థిక వ్యవహారాలతో ముడిపడిన ఒత్తిడినీ, అశాంతినీ దూరం చేయడానికి అవతరించిన మానసిక-ఆర్థిక నిపుణుడే 'వెల్త్ సైకాలజిస్ట్'. 'మనీ మైండ్‌సెట్ కోచ్', 'ఫైనాన్షియల్ బిహేవియర్ స్పెషలిస్ట్' అనీ పిలుస్తారు. వీరికి చార్టర్డ్ అకౌంటెన్సీ, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ వగైరా అర్హతలకు అదనంగా క్లినికల్ సైకాలజీ లాంటి మనస్తత్వ విభాగాల్లో పట్టాలూ ఉంటాయి. దీంతో ఆర్థిక నిర్ణయాల మీద మనసు ప్రభావాన్ని బేరీజు వేయడం సులభం అవుతుంది. అందులోనూ, మనం తీసుకునే ఆర్థిక నిర్ణయాల్లో తొంభైశాతం వరకూ భావోద్వేగాలతో ముడిపడినవే. మిగతా పదిశాతం సందర్భాల్లో మాత్రమే 'లాజిక్'ను ఉపయోగిస్తాం. అంటే, సరైన ఆర్థిక నిర్ణయం తీసుకోవాలంటే మనసు మీదా, మనసులోంచి పుట్టుకొచ్చే భావోద్వేగాల మీదా పట్టు ఉండాల్సిందే. అలా అని, వెల్త్ థెరపిస్ట్ పెట్టుబడుల సలహాలు ఇవ్వడు. స్టాక్ మార్కెట్ చిట్కాలు చెప్పడు. రియల్ ఎస్టేట్ లాభాల గురించీ ఊదరగొట్టడు. మన ఆర్థిక విజయాలకు అడ్డంకిగా మారుతున్న నెగటివ్ ఆలోచనల్ని గుర్తించి, ఎలా వదిలించుకోవాలో సూచిస్తాడంతే. ఆ నిపుణుల్ని సంప్రదిస్తున్న వారిలో వృత్తి, ఉద్యోగాల్లో పైపైకి ఎగబాకుతున్న కొత్త సంపన్నులు ఉన్నారు, ఇప్పటికే 'హై నెట్‌వర్త్' జాబితాలో చేరిపోయిన శ్రీమంతులూ ఉన్నారు! కిందికి జారిపోతామేమో అన్న భయం ఒకరిది, అక్కడే ఆగిపోతామేమో అనే అనుమానం మరొకరిది. మొన్నటి వరకూ అమెరికా, యూకే, సింగపూర్ తదితర దేశాలకే పరిమితమైన వెల్త్ సైకాలజిస్టుల సేవలు క్రమంగా భారత్‌కూ విస్తరిస్తున్నాయి. ఫైనాన్షియల్ థెరపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లాంటి శిక్షణ సంస్థలూ ఇక్కడ పుట్టుకొస్తున్నాయి. గతంతో పోలిస్తే బిహేవియరల్ ఫైనాన్స్ కోర్సుల్ని అందిస్తున్న క్యాంపస్‌ల సంఖ్య కూడా పెరుగుతోంది. సంపన్నులతో వ్యవహారం కాబట్టి, కన్సల్టేషన్ ఫీజులు కూడా భారీగానే ఉంటాయి. ఒక్కో సిట్టింగ్‌కూ లక్ష రూపాయల వరకూ వసూలు చేస్తున్నవారూ ఉన్నారు.

ఆర్థిక తాత్వికత

'మన సంతోషం, సంతృప్తి బ్యాంకు ఖాతాలోని డబ్బు మీద కంటే... ఆ డబ్బుతో మనకున్న ఆరోగ్యకరమైన అనుబంధం మీదే ఎక్కువ ఆధారపడి ఉంటుంది. ఆ పాజిటివ్ దృక్పథాన్నే నేను వెల్త్ ఫిలాసఫీ అని పిలుస్తాను' అంటారు అమెరికన్ మనీ సైకాలజిస్ట్ డాక్టర్ లామీ. ఆ ఆర్థిక తాత్విక దృష్టి లేనప్పుడు, ఎంత సంపాదించినా అసంతృప్తిగానే ఉంటుంది. సకల సౌకర్యాల నడుమ జీవిస్తున్నా ఉక్కపోతగా అనిపిస్తుంది. అలాంటి వ్యక్తులు పేరుకు కుబేరులే అయినా, మానసికంగా మాత్రం నిరుపేదలే. ఓ తాజా సర్వే ప్రకారం... అమెరికాలోని శ్రీమంతుల్లో 32 శాతం మందే, తాము సంపన్నులమని భావిస్తున్నారట. అంటే, మిగిలిన 68 శాతం అసంతృప్తితో రగిలిపోతున్నారన్నమాట. శాతాల్లో తేడా ఉండొచ్చు కానీ, భారతీయ లక్ష్మీపుత్రులూ ఇందుకు మినహాయింపు కాదు. పెరిగిపోతున్న డబ్బు జబ్బుల కారణంగానే... ప్రవీణ్ సాంకర్, నిషుల్ గుప్తా, కమల్ జెస్వానీ లాంటి వెల్త్ సైకాలజిస్టుల అపాయింట్‌మెంట్ల కోసం బెంజికారు బాబులు వరుసలు కడుతున్నారు. ఒక మహిళ మనసును మరో మహిళ మాత్రమే అర్థం చేసుకోగలదని అంటారు. అందుకే కావచ్చు, ప్రత్యేకించి సంపన్న మహిళల కోసం మీనా శ్రీరామ్‌లాంటి వెల్త్ కోచ్‌లు అవతరిస్తున్నారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు కాకపోవచ్చు కానీ, ఆర్థిక సంబంధాలు మానవ సంబంధాల్ని తప్పక ప్రభావితం చేస్తాయి. ఆలుమగల మధ్య గొడవల్ని సృష్టిస్తాయి. తండ్రీకొడుకుల్ని శత్రువులుగా మార్చేస్తాయి. తోబుట్టువుల్ని బద్ధవిరోధులుగా తయారు చేస్తాయి. అలాంటి సందర్భాల్లో వెల్త్ థెరపిస్టులు అచ్చంగా రిలేషన్‌షిప్ ఎక్స్‌పర్ట్ అవతారం ఎత్తుతున్నారు. కుబేర కుటుంబాల్లో... ఉద్వేగాలతో ముడిపడిన ఆర్థిక సమస్యలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలు సూచిస్తున్నారు. క్లైంట్ అవసరాలకు అనుగుణంగా మెంటర్లుగా, సలహాదారులుగా కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. కొన్ని సంపన్న కుటుంబాలు ఫ్యామిలీ వెల్త్ సైకాలజిస్టులనూ నియమించుకుంటున్నట్టు సమాచారం. వృత్తిపరమైన గోప్యత కారణంగా, ఆ వివరాల్ని బయట పెట్టడానికి ఆ మనీ థెరపిస్టులు పెద్దగా ఇష్టపడటం లేదు.



ఆర్థిక రుగ్మతలు

కొన్ని ఆర్థిక-మానసిక రోగాలు పైపైకి సహజ స్వభావాల్లా అనిపిస్తాయి. ఆయా వ్యక్తులూ అలానే అనుకుంటారు. ఏ నిపుణుడినో సంప్రదిస్తే తప్పించి సమస్య మూలాలు తెలియవు. ఇలాంటి సందర్భాల్లో ఆత్మీయులే చికిత్సకు ప్రోత్సహించాలి.

ఆనియో మానియా: ఏదో ఒకటి షాపింగ్ చేయకపోతే మనసుకు స్థిమితంగా అనిపించదు.

ప్లూటో మానియా: సంపద పట్ల విపరీతమైన వ్యామోహం ఉంటుంది. చిల్లర డబ్బుల కోసం కూడా అడ్డదార్లు తొక్కుతారు.

క్రెమెటో ఫోబియా: ప్రాణాల మీదికి వచ్చినప్పుడు కూడా డబ్బును ఖర్చు చేయడానికి ఇష్టపడరు. సరైన వైద్యమూ చేయించుకోరు.

మైండ్‌సెట్ పాఠాలు

నైట్‌ఫ్రాంక్ వెల్త్ రిపోర్ట్- 2025 ప్రకారం... వెయ్యి కోట్లకు పైగా ఆస్తిపరులు లక్షమందికి పైనే ఉన్నారు. అందులో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఈ స్థాయికి చేరుకున్న తొలితరం సంపన్నులే అధికం. మనిషి ఆర్థికంగా ఎదిగే క్రమంలో ఒకలా ఆలోచించాలి, ఆ తర్వాత మరోలా ఆలోచించాలి. సున్నా నుంచి వందో స్థానానికి చేరుకోడానికి 'సర్వైవల్ మైండ్‌సెట్' చాలా అవసరం. ఎందుకంటే, ఎదుగుతున్న రోజుల్లో ప్రతినిత్యం ఓ గండమే. ఆ క్షణం

గురించీ, ఆ పూట గురించీ తప్పక ఆలోచించాల్సిందే. ఓ స్థాయికి చేరుకున్నాక మాత్రం వ్యూహం మార్చుకోవాలి. తొలి పది స్థానాలకు చేరుకోవాలంటే 'గ్రోత్ మైండ్‌సెట్'ను అభివృద్ధి చేసుకోవాల్సిందే. రాబోయే పాతికేళ్ల గురించీ ఆలోచించాల్సిందే. కానీ, చాలా మంది కొత్త కుబేరుల విషయంలో అలా జరగడం లేదని వాపోతారు వెల్త్ సైకాలజిస్టులు. ఓ పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నా సరే, చిన్నచిన్న నిర్ణయాలు సైతం తామే తీసుకోవాలని ఆరాటపడతారు. దీనివల్ల ఆ వ్యాపార పరివారానికి దీర్ఘకాలిక దృష్టి లోపిస్తుంది. సరైన సలహాలూ, సూచనలతో ఆ కాలంచెల్లిన ఆలోచనా ధోరణిని సరిదిద్దే ప్రయత్నం చేస్తారు ఆర్థిక-మానసిక నిపుణులు.

ఏ వ్యక్తి అయినా ఆర్థికంగా విస్తరించే కొద్దీ... అతని వ్యక్తిగత ప్రపంచం చిన్నదైపోతుంది. ఓ స్థాయికి వెళ్లేసరికి... సప్త సముద్రాలకు అవతల, ఒంటిస్తంభం మేడలోని పంజరపు రామచిలుకలా మారిపోతారు. ఏకాకితనం తీవ్రంగా వేధిస్తుంది. ఎవరితోనూ కష్టసుఖాల్ని పంచుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఎవర్నీ నమ్మే వాతావరణం ఉండదు. నమ్మినా, ఆ చనువును స్వార్థానికి వాడుకుంటారేమో అనే అనుమానం ఉండనే ఉంటుంది. అలాంటి సమయాల్లో వెల్త్ థెరపిస్టులు ప్రొఫెషనల్ కౌన్సెలర్ పాత్రను పోషిస్తారు. అవతలి వ్యక్తి చెప్పేదంతా ఓపిగ్గా వినిపెడతారు. తగిన పరిష్కారాలూ సూచిస్తారు. 'కొద్దిరోజుల క్రితం ఓ వ్యాపారవేత్త నన్ను సంప్రదించారు. వయసు అరవై పైనే. కుటుంబ సభ్యుల ఒత్తిడితో, తన కంపెనీని ఓ బహుళజాతి సంస్థకు అమ్మేశారు. ఆ లావాదేవీలో ఐదారు వేల కోట్లు చేతికి వచ్చాయి. ఎందుకో, ఆ తర్వాత ఆయన ఆరోగ్యం దెబ్బతింది. గుండెపోటు నుంచి బయటపడ్డారు. ఓరకమైన నైరాశ్యమూ ఆవహించింది. పిచ్చాపాటీగా మాట్లాడుతున్నప్పుడు, తాను పెంచి పోషించిన కంపెనీని ఆయన ఓ బిడ్డలా భావించేవారని తెలిసింది. పిల్లలు రెక్కలొచ్చి వెళ్లిపోయాక... కన్నవాళ్లు అనుభవించే 'ఎమ్టీ నెస్ట్ సిండ్రోమ్' తరహా మానసిక స్థితిలో ఆయన చిక్కుకున్నారని అర్థమైపోయింది. గతకాలపు ఆలోచనల నుంచి బయటికి తీసుకురావడానికి... ఓ కొత్త దినచర్యను సూచించాను. ఆయన వ్యక్తిగత లైబ్రరీ దుమ్ము దులిపించాను. అంకుర సంస్థల్లో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాను. ఇప్పటిదాకా వెళ్లని దేశాలకు వెళ్లిరమ్మని కూడా చెప్పాను. ఆరు నెలల్లో చాలా మార్పు వచ్చింది' అంటూ ఓ శ్రీమంతుడి జీవితాన్ని ఉదాహరణగా చూపుతారు వెల్త్ సైకాలజిస్ట్ ప్రవీణ్ సాంకర్. ప్రవీణ్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్ మాత్రమే కాదు, సైకాలజీలో డాక్టరేట్ పట్టా కూడా అందుకున్నారు. నిన్నమొన్నటి వరకూ విదేశీ క్లైంట్లతో బిజీగా ఉండేవారు. ఇప్పుడు, భారతీయ కుబేరులకూ సమయం కేటాయిస్తున్నారు.

డబ్బుతో 'రిలేషన్‌షిప్'...

కొంతమంది ఓ స్థాయి వరకూ కష్టాన్నే నమ్ముకుని ఎదిగినా, ఆ తర్వాత దొడ్డిదారిని ఎంచుకుంటారు. అవినీతిపరులతో చేతులు కలిపి ఆర్థిక కుంభకోణాల్లో చిక్కుంటారు. ఈజీ మనీ కోసం చీకటి వ్యాపారాల్లో ప్రవేశిస్తారు. చివరికి ఆర్థిక నేరస్థులుగా జైలు జీవితం గడుపుతారు. దీనికి కారణం, వారికి డబ్బుతో ఉన్న 'నెగటివ్' సంబంధమే!

కీర్తి కాంక్షతో తరచూ కళా సాంస్కృతిక వేదికల మీద కనిపించే ఓ ప్రముఖుడు హఠాత్తుగా దివాలా ప్రకటన చేస్తాడు. విలాసాలకూ ఆర్భాటాలకూ మారుపేరైన ఓ వ్యాపారవేత్త రాత్రికి రాత్రే విదేశాలకు పారిపోతాడు. ఈ దుస్థితికి మూలం, వారికి డబ్బు పట్ల గౌరవం లేకపోవడమే!

డబ్బును పిచ్చిగా ప్రేమించేవారూ, తీవ్రంగా ద్వేషించేవారూ బాగుపడిన దాఖలాలు చరిత్రలో లేవు. సంపదతో ఆరోగ్యకరమైన అనుబంధం ఉన్నవారు మాత్రమే ప్రశాంతంగా, సంతృప్తికరమైన జీవితం గడపగలరు. తమ క్లైంట్ ఆలోచనల్లో తేడా కనిపించినప్పుడు, బిహేవియర్ థెరపీ లాంటి విధానాల ద్వారా ఆ మానసిక లోపాన్ని సరిచేస్తారు వెల్త్ సైకాలజిస్టులు.

ఏ కుటుంబమైనా పదికాలాల పాటూ చల్లగా ఉండాలంటే, డబ్బు-మనిషి అనుబంధమే కాదు, మనిషి-మనిషి సంబంధమూ బలంగా ఉండాలి. అందులోనూ పిల్లల పెంపకం ఓ పెద్ద సవాలు. మరీ మధ్యతరగతి వాతావరణంలో పెంచితే... వాళ్లలో ఆత్మన్యూనత వచ్చేస్తుంది. నాయకత్వ లక్షణాలు కనుమరుగైపోతాయి. ఖరీదైన జీవనశైలిని అలవాటు చేస్తేనేమో... అహంకారం తలకెక్కుతుంది. దురలవాట్ల బారినపడే ప్రమాదం ఉంది. ఇలాంటివారే... మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ పాదచారుల్ని బలితీసుకుంటారు, సిగ్నల్స్ దగ్గర ట్రాఫిక్ సిబ్బందిని దూషిస్తారు, పబ్‌లోనో బార్‌లోనో గొడవలు పడి దాడులకు తెగబడతారు, కొన్నిసార్లు క్షణికావేశంలో ప్రాణాలూ తీస్తారు. ఆస్తులూ, అధికారమూ... అన్నీ ఉన్నాయన్న అభిజాత్యం బుసలు కొడుతూ ఉంటుంది. డబ్బుతో ఏమైనా చేయగలమనీ, దేన్నయినా కొనగలమనీ అనుకుంటారు. సైకాలజీలో ఈ స్వభావానికి ఓ పేరు ఉంది... అఫ్లుయాంజా! అవసరాన్ని బట్టి, పిల్ల జమీందార్ల ప్రవర్తనలో తేడాలను గుర్తించి, సరిదిద్దే బాధ్యతను కూడా వెల్త్ సైకాలజిస్టులే తీసుకుంటారు.

★ ★ ★

మార్కెట్‌ను అర్థం చేసుకుంటే ఎంతైనా సంపాదించగలం. కానీ, మనల్ని మనం అర్థం చేసుకోలేకపోతే మాత్రం... అప్పటి వరకూ సంపాదించిందంతా వృథా అయిపోయినట్టే. మన డబ్బే మనకు శత్రువు అవుతుంది. ఈ సత్యాన్ని తెలుసుకోగలిగితే... మనలోనూ ఓ వెల్త్ సైకాలజిస్ట్ ఉన్నట్టే! అతను చురుగ్గా పనిచేస్తున్నట్టే! ★

హార్ప్యాక్సో ఫోబియా: విపరీతమైన దొంగల భయం. అయినవారిని కూడా దొంగల్లానే చూస్తారు. అనుమానం ఎక్కువ.

పెనియా ఫోబియా: హఠాత్తుగా ఆస్తులన్నీ మాయమైపోయి వీధిపాలు అవుతామనే అకారణ ఆందోళన.

అటైచీ ఫోబియా: చిన్నచిన్న పెట్టుబడులు పెట్టాలన్నా భయమే. లేని నష్టాలను ఊహించుకుంటారు.

మనీ డిస్‌మార్ఫియా: ఎంత సంపాదించినా కూడా, మిగిలిన వారితో పోలిస్తే ఆర్థికంగా వెనుకబడి ఉన్నామనే అర్థంలేని ఆలోచన.

ఫైనాన్షియల్ పెరాలసిస్: ఓ పట్టాన ఆర్థిక నిర్ణయాలు తీసుకోలేని తీవ్ర బలహీనత.

గ్యాంబ్లింగ్ డిజార్డర్: ఆస్తులు తాకట్టుపెట్టి అయినా సరే జూదానికి వెళ్లే బలహీన మనస్తత్వం.



అదిరేటి ఆవిష్కరణలు!

ఒకప్పటి కంప్యూటర్ చాలా పెద్దది... ఏకంగా ఒక గది నిండా ఉండేది! దాని ధర... నేటి లెక్కల ప్రకారం... 59 కోట్ల రూపాయలు. ఆ కంప్యూటర్ ఇప్పుడు అరచేతిలో ఇమిడిపోయేంత చిన్నదైంది. ధర కూడా అతిసామాన్యులకి అందుబాటులోకి వచ్చింది. తొలిసారి కంప్యూటర్‌ని ఆవిష్కరించినవాళ్లు ఎంత ఘనులో... దాన్ని సామాన్యులకి చేరువ చేసిన తర్వాతి తరంవాళ్లూ అంతే గొప్పవారు. ఈ మూడు బృందాలవాళ్లూ అలాంటి ఆవిష్కర్తలే, ఆకాశంలో తారట్లాడుతున్న సాంకేతికతని నేలకి దించినవాళ్లే. అదెలాగో చూడండి...





మట్టి పరీక్ష... అతి సులభంగా!

విత్తనం వేయడానికీ, నారుపోయడానికే కాదు... ఎరువులు చల్లడానికి కూడా వ్యవసాయంలో అదును చాలా ముఖ్యం. మట్టిలోని పోషకాలని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ఎరువులు వాడితే... భూసారం తగ్గుతుంది. మరి ఆ లోపాల్ని గుర్తించేందుకు అవసరమైన పరీక్షా కేంద్రాలు ఉన్నాయా అంటే... అదీ లేదు. దేశం మొత్తం మీద వాటి సంఖ్య 30 వేలే. పైగా ఫలితాలు రావాలంటే వారమైనా పడుతుంది. ఈ సమస్యకి పరిష్కారంగానే కేవలం ఐదు నిమిషాల్లో భూసార పరీక్షల ఫలితాల్ని నేరుగా మన మొబైల్‌కే పంపించే ఓ సరికొత్త పరికరాన్ని ఆవిష్కరించారు ఐఐటీ-బాంబే పరిశోధకులు. ఓ చిన్న కాగితంలో మనం మట్టిని పోస్తే చాలు... అందులోని పీహెచ్ స్థాయులూ పోషకాల వివరాలూ అన్నీ చెప్పేస్తుంది. డాక్టర్ రజుల్ పట్కార్, ప్రొఫెసర్ వేణుగోపాలరావు సంయుక్తంగా 'సాయిల్‌సెన్స్' అనే ఈ పరికరాన్ని ఆవిష్కరించారు. మార్కెట్‌లో మట్టిపరీక్షల పరికరాల ధరలు రూ.70 వేల నుంచీ లక్ష రూపాయల దాకా ఉంటాయి. ఇక్కడ మాత్రం రూ.35 వేలలోనే విక్రయిస్తున్నారు. గ్రామీణ మహిళల్ని బృందంగా కూడగట్టి సాయిల్‌సెన్స్ పరికరం వాడకంపైన శిక్షణ ఇచ్చి మరీ వాటిని సబ్సిడీపైన అందిస్తున్నారు. అలా, ప్రతి గ్రామంలోనూ ఈ మహిళలే పరీక్షలు నిర్వహిస్తూ కొత్త ఉపాధిని సాధిస్తున్నారు. సాయిల్‌సెన్స్ పరికరాన్ని ఇప్పటికే తెలంగాణ, మహారాష్ట్ర, పంజాబ్, మధ్యప్రదేశ్‌లకి చెందిన 15 వేలమంది రైతులు వాడుతున్నట్టు ఆవిష్కర్తలు చెబుతున్నారు.





పారా హుషార్... అంటుంది!


వెంకట ఉదయ్... ఉస్మానియాలో ఇంజినీరింగ్ చేశాడు. ఎన్ఐటీ వరంగల్‌లో పీజీ ముగించి... ఐఐటీ బాంబేలో పీహెచ్‌డీ పూర్తిచేశాడు. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్న ఐఐటీ-మండీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఐఐటీ హిమాలయాల్లోని శివాలిక్ శ్రేణుల పొత్తిళ్లలో ఉంటుంది. ప్రకృతి అందాలకి పెట్టని కోట. కానీ, వర్షాకాలం వస్తే కొండచరియలు విరిగిపడి తీవ్ర విపత్తులు ఏర్పడుతుంటాయి. ఈ సమస్య పరిష్కారానికి పదిహేనేళ్లుగా శ్రమిస్తోంది ఉదయ్ బృందం. ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతలు అందుబాటులోకి రావడంతో సరికొత్త ద్వారాలు తెరుచుకున్నాయి. వాటి సాయంతో ఈ మధ్యే కొండచరియలు విరిగిపడటాన్ని ముందుగానే పసిగట్టే సరికొత్త పరికరాన్ని ఆవిష్కరించిందీ బృందం. విపత్తును మూడుగంటల ముందే గుర్తించి సైరెన్‌ల ద్వారా, ఎస్ఎంఎస్‌ల ద్వారా ఇది అటు ప్రజల్నీ ఇటు ప్రభుత్వాలనీ హెచ్చరిస్తుంది. కొండచరియలు ఒక్క మిల్లీమీటరు కదిలినా అప్రమత్తమైపోతుందట. ఇలాంటి పరికరాలు విదేశాల్లో అందుబాటులో ఉన్నా... ధర మాత్రం 30-40 లక్షల పైమాటే. కానీ వెంకట ఉదయ్ తయారుచేసిన ఈ పరికరం టీవీ యాంటెనా పరిమాణంతో, విదేశీ ధరలలో పదోవంతుకే లభిస్తుంది. ఇప్పటికే హిమాలయ రాష్ట్రాల్లో వీటిని వాడుతున్నారు.





3 నేత్రం... ఓ అద్భుతం

ఆ ప్రభుత్వ పథకం పేరు 'కిడ్‌డ్రాప్'. నెల తక్కువ బిడ్డల్లో మూడో వంతుమందికి కంటి రెటినా సమస్య (రెటినోపతి) ఉంటుంది. దాన్ని ముందుగా పసిగడితే పూర్తిస్థాయిలో చికిత్స అందించవచ్చు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో అదంతా అసాధ్యం. ఆధునిక నేత్రపరీక్షా పరికరాలు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. అందుకే కర్ణాటక ప్రభుత్వం ఈ 'కిడ్‌డ్రాప్' పథకాన్ని చేపట్టింది . అందులో భాగంగా గ్రామీణ శిశువులకూ అవసరమైన పరీక్షల్ని అందిస్తోంది. ఈ క్రతువులో కర్ణాటక ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచింది '3నేత్ర' అనే పరికరం. ఏఐతో పనిచేసే అత్యాధునిక కంటి పరీక్షా యంత్రం ఇది. చంద్రశేఖర్, డాక్టర్ శ్యామ్ వాసుదేవ రావు ఆవిష్కర్తలు. చంద్రశేఖర్ బిట్స్ పిలానీలో చదివే కాలంలో దీనికి రూపకల్పన చేశారు. డాక్టర్ శ్యామ్ కంటి రోగుల అవసరాన్నిబట్టి దాన్ని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. ఇద్దరూ కలిసి 'ఫోరస్ హెల్త్' అనే సంస్థని స్థాపించి... 3నేత్రని సామాన్యులకి చేరువచేస్తున్నారు. సంప్రదాయ కంటి పరీక్షా యంత్రాలకి మారుగా... ఈ బుల్లి పరికరంతో ఎవరైనా పరీక్షలు నిర్వహించొచ్చు. ఇంతగా ఉపయోగపడటం వల్లే... మనదేశంలోనే కాకుండా అమెరికా, కొలంబియా, దక్షిణాఫ్రికా, మయన్మార్ సహా 75 దేశాల్లో దీన్ని ఉపయోగిస్తున్నారు. ఇప్పటిదాకా రెండుకోట్లమంది నిరుపేదలకి దీని ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించినట్టు గణాంకాలు చెబుతున్నాయి.



‘యముడికీ... మీకూ మధ్య నేను అడ్డుగా ఉంటాను’ రాఘవేంద్ర కారు అద్దంపైన ఈ మాటే రాసి ఉంటుంది. ‘ఏంటీ యముడికే ఎదురు నిలిచేంత మొనగాడా?’ అనిపిస్తోంది కదూ! రోడ్డు ప్రమాదాలకు వ్యతిరేకంగా ఆయన చేస్తున్న పోరాటం గురించి తెలిస్తే, ఆ మాట అక్షరాలా నిజమే అని అంగీకరిస్తారు. ఇల్లూ, పొలమూ తెగనమ్మి మరీ శిరస్త్రాణాలు పంచే ‘హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా’ రాఘవేంద్ర కుమార్ ఆశయం చాలా గొప్పది.



హెల్మెట్ల కోసం ఆస్తులనే అమ్మేశాడు!

29గ్-బి

అమితాబ్ బచ్చన్‌కి ఓ అలవాటు ఉంది. ప్రతి ఆదివారం తనని కలవడానికి వచ్చే అభిమానులకి ఏదో ఒక కానుక ఇస్తుంటారు. అలా, ఆమధ్య హెల్మెట్లని కూడా ఇచ్చారు. వాటిని అందుకున్న వారు తెగ ఆశ్చర్యపోయి... ‘ఇవే ఎందుకు ఇచ్చారు?’ అని అడిగితే, ‘నా కౌన్ బనేగా కరోడ్‌పతి షోకి వచ్చిన రాఘవేంద్ర స్ఫూర్తితో...’ అని జవాబిచ్చారు బచ్చన్ సాబ్. ఒక్క అమితాబ్ మాత్రమే కాదు నటుడు సోనూసూద్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా రాఘవేంద్ర నుంచి స్ఫూర్తి పొందినవాళ్లే. ఇంతకీ ఎవరీ రాఘవేంద్ర, ఏం చేస్తాడు? అనేగా మీ సందేహం! తను ఉదయం నుంచి సాయంత్రం వరకూ హైవేల దగ్గర నిల్చుని ఆ దారిన పోయే వాహనదారుల్లో ఎవరైనా తలకి హెల్మెట్ లేకుండా కనిపిస్తే, ఆపి మరీ ఉచితంగా శిరస్త్రాణాలు ఇస్తుంటాడు. ఏడాదికోసారో, నెలకోసారో ఇలా చేస్తే ఆయన గురించి మాట్లాడుకునేవాళ్లమే కాదు. రోజంతా అదే పనిమీద ఉంటాడు. అవును, ఇంతవరకూ మూడున్నర కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి 70వేల హెల్మెట్లను ఉచితంగా పంచాడు. అలా అని ఆయనేమీ ధనవంతుడు కాదు. హెల్మెట్లని పంచడం కోసం పొలాన్ని అమ్మేశాడు. స్నేహితులూ, బంధువులూ ‘ఇదేం పిచ్చి’ అన్నా పట్టించుకోలేదు. ‘నా పిచ్చి ఒక్క ప్రాణాన్ని కాపాడినా చాలు’ అనుకున్నాడు. ఆ తీర్మానం వెనుక ఓ బలమైన కారణమూ ఉంది.

స్నేహితుడి మరణంతో...

రాఘవేంద్ర కుమార్‌ది బిహార్‌లోని ఓ కుగ్రామం. న్యాయశాస్త్రం చదువుకోవడానికి దిల్లీకి వెళ్లాడు. కాలేజీకి దగ్గర్లో ఓ హాస్టల్‌లో చేరాడు. ఇంజినీరింగ్ విద్యార్థి కృష్ణకుమార్‌దీ బిహారే కావడంతో ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. “ఓ రోజు... ఊరికి వెళ్తున్నారా, ఇంటికి చేరుకున్నాక ఫోన్ చేస్తాలే, అని చెప్పి బయల్దేరిన నా ఫ్రెండ్ తిరిగి ఫోన్ చేయలేదు కానీ, వేరెవరో కాల్ చేసి నీ ఫ్రెండ్‌కి యమునా ఎక్స్‌ప్రెస్‌వే మీద యాక్సిడెంట్ అయ్యింది, ఐసీయూలో ఉన్నాడని చెప్పారు. పరుగుపరుగున వెళ్లి చూస్తే, వాడి ఒంటిమీద ఒక్క గాయం కూడా లేదు, తలకి మాత్రం పెద్ద దెబ్బ తగిలి నిర్జీవంగా పడున్నాడు. ‘వాడేం అడిగినా కొనిచ్చాం. అడక్కుండానే ఒక్క హెల్మెట్ కొనివ్వాల్సింది’ అంటూ గుండెలు బాదుకుంటున్న వాళ్లమ్మను చూసినప్పుడు నా మనసులో ముల్లు గుచ్చుకున్నట్టు అనిపించింది. ఇది జరిగి పదేళ్లు అవుతోంది. ఇన్నేళ్లలో ఆ తల్లి మాటలని మరిచిపోయిన క్షణం అంటూ లేదు. ఒక యాక్సిడెంట్ కుటుంబం మొత్తాన్ని ఎలా రోడ్డున పడేస్తుందో కళ్లారా చూశాక, నాకు తెలిసి అలా మరో ప్రాణం పోకూడదని నిశ్చయించుకున్నా” అంటూ తనను లక్ష్యం వైపు నడిపిన చేదు జ్ఞాపకాన్ని పంచుకుంటాడు రాఘవేంద్ర. 2014 నుంచీ హెల్మెట్లని ఉచితంగా ఇస్తున్నాడు తను. మొదట్లో లాయర్ వృత్తిని కొనసాగిస్తూనే తీరిక సమయంలో పంచేవాడు. తన ముందున్న లక్ష్యం ఎంత గొప్పదో తెలిశాక అదీ వదిలేశాడు. నొయిడాలోని తన ఇంటిని విక్రయించాడు. డబ్బు కోసం భార్య నగలు తాకట్టు పెట్టాడు. కొడుకుని తన స్వగ్రామంలోని ప్రభుత్వ బడిలో చదివిస్తున్నాడు. “2020లో హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ మొదలుపెట్టాను. ఇప్పటివరకూ 22 రాష్ట్రాలు తిరిగి, అక్కడి ప్రభుత్వాలతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేశాను. ఇంతవరకూ 70వేల హెల్మెట్లని ఉచితంగా పంచాను. అలా అందుకున్న వాళ్లలో 35మంది తమకి యాక్సిడెంట్ అయినా కూడా, హెల్మెట్ కారణంగా ప్రాణాలు కాపాడుకున్నారు. అంతకంటే సంతోషం ఏముంటుంది? వాళ్లందరూ నా ఆశయాన్ని కచ్చితంగా ముందుకు తీసుకెళ్తారు. మనదేశంలో ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 87శాతం మరణాలకు కారణం హెల్మెట్ లేకపోవడమే! ఆ కుటుంబాలకు చెందిన తల్లులూ, చెల్లెళ్ల బాధ నన్ను ఒక్క చోట కూర్చోనివ్వడం లేదు. నేనున్నంత వరకూ ఈ ఉచిత హెల్మెట్ ఉద్యమాన్ని ఆపను” అంటాడు రాఘవేంద్ర. ఎవరైనా హెల్మెట్ మర్చిపోయి కాలేజీకి వెళ్లినప్పుడు, తాత్కాలికంగా ఉపయోగించుకుని తిరిగి ఇచ్చేలా విద్యాసంస్థల దగ్గర హెల్మెట్ బ్యాంకులని కూడా ఏర్పాటు చేస్తున్నాడు. ఈ ప్రాజెక్టులో ఇండియన్ ఆర్మీ అతనికి అండగా నిలుస్తోంది.

పుస్తకాలనూ పంచుతూ...

“కృష్ణ చనిపోయాక వాళ్లింట్లో తన ఇంటర్ పుస్తకాలు కనిపించాయి. వాటిని ఓ పేద కుర్రాడికి ఇచ్చాను. కొన్నిరోజులకి ఆ అబ్బాయి తండ్రి ఫోన్ చేసి ‘బాబూ! మావాడు జిల్లా ఫస్ట్ వచ్చాడు’ అని చెప్పాడు. ఆ రోజు నుంచీ పుస్తకాలని కూడా సేకరిస్తూ, అవసరమైన వారికి ఉచితంగా ఇస్తున్నా” అంటాడు రాఘవేంద్ర. ఇంతవరకూ 70వేల మంది పిల్లలకు ఉచితంగా పుస్తకాలు అందించాడు అతను. ఆ అలుపెరగని ప్రయత్నాన్ని తెరకెక్కించే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. త్వరలోనే ‘హెల్మెట్ మ్యాన్’ పేరుతో పాన్ ఇండియా సినిమా కూడా రానుంది. ★



అదిరెను వాచీ స్టైలే!

పొద్దును బట్టి సమయాన్ని అంచనా వేసే రోజులు ఎప్పుడో పోయాయి. కాలాన్ని తెలిపే వాచీనే ఫోన్‌లా ఉపయోగించుకునే టెక్ యుగం వచ్చేసింది. ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌లాంటి గడియారమే- సరికొత్త ఫీచర్లతో రక్షణ కవచంలా మారిపోయింది. సోలార్ టెక్నాలజీతో జతకట్టి అల్ట్రామోడర్న్ లుక్కును తెచ్చుకుంది. లెదర్‌తో మొదలైనా బంగారు మెరుపులకూ, వజ్రాల కాంతులకూ విస్తరించింది. నయా ఫీచర్లూ, సరికొత్త స్టైల్స్‌తో ఈతరాన్నీ ప్రేమలోకి దింపుతున్న వెరైటీ వాచీల సంగతులే ఇవన్నీ...



మణికట్టు నగలు!

వయ్యారంగా కురుల్ని సవరించుకునే కోమలాంగి సుకుమారమైన చేతికి కొత్త అందాన్ని అద్దేందుకు ఇప్పటికే బంగారు గాజులూ, బ్రేస్‌లెట్లూ ఉండనే ఉన్నాయి. కానీ, ఈతరం అమ్మాయిలు - పసిడి వన్నెలతో కాంతులీనే వాచీలతో మణికట్టును ముస్తాబు చేసుకోవాలని తహతహలాడుతున్నారు. పెద్దపెద్ద జ్యువెలరీ సంస్థలు కూడా పచ్చలూ, కెంపుల్లాంటి విలువైన రత్నాల్ని జోడించి, కళాత్మకమైన నగిషీలతో చూడచక్కని డిజైన్లలో గోల్డ్ వాచీల్ని తయారు చేస్తున్నాయి. డయల్‌కి అయితే ముత్యాలూ, రంగుల పూసల హంగుల్నీ అద్దుతున్నాయి. నవతరం అమ్మాయిల వాచీలు... గాజులూ, బ్రేస్‌లెట్ల డిజైన్లలోనూ ఆకట్టుకుంటున్నాయి. చెవి కమ్మలూ, నెక్లెసులూ, హారాల మాదిరిగానే బంగారు పూత పూసినవీ, వెండితో చేసినవీ వస్తున్నాయి. వాచీ అతివ మది దోచే ఆభరణంగానూ మారింది. ముస్తాబులో నగధగలకు గట్టిపోటీ ఇస్తోంది.

ఫోన్‌తో పన్లేదు!

ఇస్మార్ట్ కుర్రకారు చేతికి స్మార్ట్ వాచీ ఉండాల్సిందే. ప్రత్యేకించి ఫిట్‌నెస్ ఫ్రీక్స్ - స్మార్ట్ వాచీల్లోని ఫీచర్లను ఒక్కటి కూడా వదలకుండా వాడేసుకుంటున్నారు. నడక, నిద్ర, రక్తపోటు, హార్ట్‌బీట్.. వంటివాటిని విశ్లేషిస్తూ, ఆరోగ్యం మీద అవగాహన కల్పించే స్మార్ట్ వాచీల హవా నడుస్తోంది ఇప్పుడు. పూర్తిగా ఫోన్ మీదే ఆధారపడకుండా... కాల్స్‌కి బదులు ఇవ్వడం దగ్గర్నుంచి మ్యూజిక్ వినడం వరకూ ఎన్నో ఆప్షన్లు ఉంటున్నాయి వీటిలో. వాయిస్ కమాండ్స్‌తో... ఫోన్ ద్వారా చేసే పనులన్నింటినీ చేతి గడియారంతోనూ చేసుకోవచ్చు. పిల్లల కోసం వస్తున్న స్మార్ట్ వాచీల ద్వారా... వాళ్లు ఎక్కడున్నారన్నదీ కనిపెట్టొచ్చు. లొకేషన్ మాత్రమేనా, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తం చేసే... ఎస్‌ఓఎస్ మెసేజ్‌లతో సహా అనేక ఫీచర్లు జోడిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్మార్ట్ వాచీలైతే- పర్సనల్ హెల్త్, ఫిట్‌నెస్ ట్రాక్ చేస్తూనే ఆరోగ్య సూచనలూ అందిస్తున్నాయి. అంతేనా, రకరకాల భాషల్నీ అనువదిస్తాయి. వృద్ధుల కోసం 'ఫాల్ అలర్ట్' అందించే గడియారాలూ వచ్చాయి. యాపిల్, శామ్‌సంగ్, గూగుల్... లాంటి కంపెనీలు కొత్తకొత్త ఫీచర్లతో తరచూ నయా మోడల్స్‌ని తీసుకొస్తున్నాయి. ఫోన్‌తో సంబంధం లేకుండా సిమ్‌కార్డ్‌తో పనిచేసే స్మార్ట్ వాచీలూ లభిస్తున్నాయి.





సోలార్ ఛార్జింగ్!



జీపీఎస్ నుంచి హెల్త్‌ట్రాక్ వరకూ అన్ని ఆప్షన్లతో స్మార్ట్ వాచీలు రావడం అన్నది బాగానే ఉన్నా... ట్రెక్కింగ్‌కూ, టూర్లకూ వెళ్లినప్పుడు వాటికి ఛార్జింగ్ పెట్టుకోవడం అన్నిసార్లు కుదరకపోవచ్చు. ఆ ఇబ్బందిని పోగొట్టడానికి సౌరశక్తితో పనిచేసే సౌర వాచీలు వచ్చేశాయి. సోలార్ అద్దాలతో తయారైన ఈ గడియారాలు సూర్యరశ్మిని శక్తిగా మార్చుకుంటాయి. దీంతో, మామూలు స్మార్ట్ వాచీల్లా ప్లగ్‌కి కనెక్ట్ చేయాల్సిన అవసరమే ఉండదు. గామిన్, కాసియో, సీకో... లాంటి సంస్థలు ఇప్పటికే సోలార్ పవర్డ్ వాచీల్ని తీసుకొచ్చాయి. అంతేకాదు... మన శరీర ఉష్ణోగ్రతతో పనిచేసే మోడల్స్ కూడా లభిస్తున్నాయి. మ్యాట్రిక్స్ పవర్ వాచీ- థర్మల్ ఎలక్ట్రిక్ టెక్నాలజీతో పనిచేస్తుంది. విడిగా ఛార్జింగ్ పెట్టక్కర్లేదు. ఓసారి చేతికి పెట్టుకున్నాక, ఒంట్లోని ఉష్ణోగ్రతతో అదే ఛార్జ్ అయిపోతుంది. మనమే ఓ ఎనర్జీ పాయింట్ అవుతాం.





ఆభరణంలోనే దాగుంది!

చేతి గాజులు, వేలి ఉంగరాలు నవరత్నాల ధగధగలతో మెరిసిపోతుంటే- ఆ సింగారం అందరినీ ఆకర్షించదూ! అవే సందర్భాన్ని బట్టి సమయం తెలిపే వాచీల్లానూ మారిపోగలిగితే- ఆ ప్రత్యేకత ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరచదూ! సరిగ్గా ఆ ఆలోచనతో పుట్టిందే సీక్రెట్ వాచీ ట్రెండ్. జ్యువెలరీలోనే వాచీని కూడా ఓ భాగం చేస్తున్నారు తయారీదారులు. అభిరుచికి తగినట్టు సంప్రదాయ ఆభరణాల లుక్కును అందించడమే కాదు, నవతరం మెచ్చేలా ట్రెండీ ఫీచర్లనూ అందుబాటులోకి తెస్తున్నారు. అమ్మాయిల ముస్తాబుతోపాటు అబ్బాయిల ఫ్యాషన్లకూ నప్పేలా ఈ సీక్రెట్ వాచీలొస్తున్నాయి.

చెక్కతోనూ చక్కగా...

కాళ్లకు ధరించే షూ దగ్గర్నుంచి కళ్లకు పెట్టుకునే గ్లాసెస్ వరకూ ప్రతిదీ కొత్తగా ఉండాలనుకుంటుంది ఈతరం. అందులోనూ, ఇప్పుడు ఫ్యాషన్ ట్రెండ్ ఎకోఫ్రెండ్లీ వైపు నడుస్తోంది. అందుకు తగ్గట్టే రీసైక్లింగ్ వుడ్‌తో అన్నిరకాల యాక్సెసరీస్‌నీ తయారు చేస్తున్నారు. పన్లోపనిగా వాచీల్ని చెక్కతో చూడచక్కగా తీసుకొస్తున్నారు డిజైనర్లు. ట్రీహట్, వీవుడ్, వుడ్‌గ్రిక్... తదితర కంపెనీలు ఈ తరహా వుడెన్ వాచీల్ని అమ్ముతున్నాయి. ఇందులో స్మార్ట్ వాచీలూ ఉన్నాయి. సరికొత్త డిజైన్లూ, ఆకట్టుకునే రంగులతో చాలా మోడల్స్ అందుబాటులో ఉన్నాయి. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకునేవారు ఈ వుడెన్ వాచీల్ని ప్రయత్నించొచ్చు.



నచ్చినట్టుగా గడియారం!



డ్రెస్సూ, జ్యువెలరీ, యాక్సెసరీ... అన్నీ డిజైన్ చేయించుకునే వెసులుబాటు ఉన్నప్పుడు, వాచీలకు మాత్రం ఎందుకు మినహాయింపు ఇవ్వాలంటూ కొన్ని సంస్థలు వీటిలోనూ కస్టమైజేషన్‌ని పరిచయం చేస్తున్నాయి. వాచీ స్ట్రాప్, డయల్, కలర్... అన్నీ మనమే ఎంచుకోవచ్చు. ఫొటో, పేరూ, నచ్చిన కొటేషన్ కూడా జోడించుకోవచ్చు. స్మార్ట్ వాచీల్లోనూ మనకు అవసరమైన ప్రత్యేక ఫీచర్లను పెట్టుకోవచ్చు, ఇష్టమైన లుక్కులోకి మార్చుకోవచ్చు. 'జైపూర్ వాచ్ కంపెనీ' ప్రాచీన కళాఖండాలతో, భారతీయ నాణేలతో ఓ ప్రత్యేక సిరీస్‌ని తీసుకొచ్చింది. అవన్నీ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. 'లెరోంజా' సంస్థ గోల్డ్ ప్లేటింగ్‌తోనూ వాచీలను తయారు చేస్తోంది. సొంతానికి వాడుకోడానికైనా, ఆత్మీయులకు కానుకగా ఇచ్చుకోడానికైనా తిరుగులేని ఎంపిక.

పెరిగే విలువ...

బ్రాండ్ వాల్యూ, డిమాండ్, అరుదైన డిజైన్ కారణంగా కొన్ని వాచీల ధరలు కాలం గడిచేకొద్దీ పెరుగుతూనే ఉంటాయి. రోలెక్స్, పాటిక్ ఫిలిప్, ఓడమాస్ పీగె... తదితర బ్రాండ్లకు మార్కెట్‌లో ఉన్న క్రేజ్ అపారం. వేలం పాటల్లో, ప్రీఓన్డ్ వెబ్‌సైట్లలో కోట్ల రూపాయలు చెల్లించి మరీ వీటిని సొంతం చేసుకుంటున్నారు. 1974లో దాదాపు రూ.32 వేలకు కొన్న రోలెక్స్ కాస్మోగ్రాఫ్ డేటోనా వాచీ ధర ప్రస్తుతం నాలుగున్నర కోట్ల వరకు పలుకుతోందంటే ఆ గిరాకీని అర్థం చేసుకోవచ్చు. లిమిటెడ్ ఎడిషన్లో 1943లో తీసుకొచ్చిన పాటిక్ ఫిలిప్ వాచీ ఓ వేలంలో రూ.156 కోట్లకు అమ్ముడైంది. గడియారమూ కాలమంత విలువైందే.



ఎన్ని రకాలో!

అందమైన ఎంబ్రాయిడరీ ఆర్ట్ జోడించినవీ, మదర్ ఆఫ్ పర్ల్ మెరుపులతో వెలిగిపోయేవీ... ఇలా వాచీల్లో అనేక రకాలు ఉన్నాయి. రెండు దేశాల సమయాల్నీ చూపే డ్యూయల్ టైమ్ జోన్ వాచీలూ దొరుకుతున్నాయి. గంటగంటకు బెల్ మోగించే బర్డ్ రిపీటర్ మోడల్సూ లేకపోలేదు. కొన్ని కంపెనీలు ప్రొజెక్టర్ వాచీలనూ తయారు చేస్తున్నాయి. ఆ ప్రొజెక్టర్ సాయంతో సమయాన్నే కాదు, వీడియోలనూ చేతిపైనే చూడొచ్చు. ఇలా ఒకటా రెండా క్లాసిక్, మోడర్న్, స్పోర్ట్స్, లగ్జరీ, ఫ్యాషన్ ... లెక్కకు మించి వెరైటీలు వచ్చేస్తున్నాయి. వాటిల్లో మీకు నచ్చిన మోడల్‌ని ఎంచుకున్నారంటే... 'హాయ్!' అంటూ మీరు పలకరిస్తున్నా సరే, అవతలివాళ్ల చూపు మాత్రం ముందుగా మీ చేతి మీదకే వెళ్తుందంటే నమ్మండి!

కథ

ఉత్తరం

– దమ్మవళం శ్రీనివాస్

తాళం తెరిచి, ఇంటి తలుపు తీసి, లైటు వేయగానే ఎదురుగా కనిపించింది చూసి ఆశ్చర్యమేసింది. గబగబా రెండడుగులు వేసి, వంగి నేలమీద పడున్నదాన్ని అందుకున్నాను. అదో ఉత్తరం! నా పేరున వచ్చింది. ఎక్కడ్నుంచా అని చూశాను. ఫ్రం అడ్రస్ లేదు.


ఈ రోజుల్లో ఉత్తరం ఏంటి? ఫోన్‌లో క్షణాల్లో మెసేజ్ పంపడం, చదవడం, రకరకాలుగా రియాక్షన్‌లు ఇవ్వడం కూడా అయిపోతోందే? లేదా ఆడియో, వీడియో కాల్స్ చేస్తూ మాట్లాడుకోవడం ఎంత సులభం. అలాంటిది పనిగట్టుకుని మరీ నాకు ఉత్తరం రాసింది ఎవరు? నాకు పరిచయం ఉన్నవారూ స్నేహితులూ బంధువులూ చకచకా మనసులో మెదిలారు. వారిలో ఎవరికీ నాకు ఉత్తరం రాయాలన్న ఆలోచనా ఓపికా ఆసక్తీ ఉంటాయని అనిపించలేదు.

'ఎవరు రాసుంటారా..?' అని మనసులో రేగుతున్న కుతూహలాన్ని కావాలనే కాసేపు పొడిగిస్తూ, కవరు చించకుండా బల్ల మీద పెట్టేశాను. కవరు మీద అంటించిన స్టాంపులూ వాటిమీద పోస్టల్ డిపార్టుమెంటు వారి ముద్రా చూస్తే ముచ్చటేసింది. ఎన్నేళ్ళయింది అలాంటి కవరు అందుకుని. త్వరగా బట్టలు మార్చుకుని, ఫ్రెష్ అయి ముందు గదిలోకి వెళ్ళి సోఫాలో తీరిగ్గా కూర్చుని ఉత్తరం విప్పాను.

అచ్చ తెలుగులో, మరీ అంత కుదురుగా లేని చేతిరాతతో రాసిన ఉత్తరం అది. గబుక్కున ఉత్తరం చివరకు వెళ్ళి ఎవరు రాశారో తెలుసుకుందామన్న కోరికను సరదాగా అణచివేశాను. 'పూర్తిగా చదివితే... ఎవరు రాసిందో తెలుస్తుందిగా' అనుకుంటూ చదవడం మొదలుపెట్టాను. అయితే, మొదటి పదం చదవగానే రాసింది ఎవరో తేలిపోయింది. ఆసక్తిగా చదవసాగాను.

'నాన్నా,

ఉత్తరం రాసింది నేనేనని అర్థమైంది కదా. అవును, నేనే! నీ ఏకైక సుపుత్రుణ్ని. నీతో ఏదైనా చెప్పాలంటే ఫోన్ చేసో లేదా మెసేజ్ చేసో చెప్పొచ్చు. నీ జవాబు కూడా వెంటనే దొరుకుతుంది. అయితే, నా సొంత చేతిరాతతో, మనం రోజూ మాట్లాడుకునే తెలుగు భాషలో, కుడిచేత్తో పెన్ను కుదురుగా పట్టుకుని, అక్షర దోషాలు లేకుండా చూసుకుంటూ, మనసులోని భావాలను పదాలుగా కూర్చుతూ, ఇదంతా నువ్వు చిరునవ్వుతో చదవడం సరదాగా ఊహించుకుంటూ- తెల్లకాగితం మీద ఉత్తరం రాయడం కచ్చితంగా వాట్సప్ మెసేజ్‌కన్నా వెయ్యి రెట్లు బావుంటుందని అంతా ఒప్పుకునే నిజం! మరైతే ఎందుకని జనాలు ఉత్తరాలు రాసుకోరూ అంటే... ఓపిక లేక! ఉరుకులు పరుగులతో జీవితం గడుపుతూ, సెల్‌ఫోన్‌కు కట్టు బానిసలా మారి, ఎప్పుడూ దేనికీ టైమ్ లేదని చిరాకు పడుతూ, ఒత్తిడే ఊపిరిగా బతికే కాలం ఇది. 'నేను మాత్రం అలాంటివాణ్ణి కాదు' అని ఊరికే అనుకోవటమేకాక, నాకు నేను నిరూపించుకోవాలి అనిపించింది. వెంటనే పనులన్నీ పక్కనబెట్టి, సెల్‌ఫోన్‌ని ఫ్లైట్ ఎక్కించి, తీరిగ్గా నీకీ ఉత్తరం రాస్తున్నా.



నీకు గుర్తుందా నాన్నా... చిన్నప్పుడు స్కూల్లో లెటర్ రైటింగ్ గురించి చెప్పిన క్లాసు మిస్ అయితే, పరీక్షలకని నువ్వు నన్ను దగ్గర కూర్చోబెట్టుకుని మరీ ఓపిగ్గా నేర్పావు. తెలుగు రాయడంలో నేను చేసే తప్పులు ఎన్నిసార్లు సరిదిద్దేవాడివో... అదంతా గుర్తొచ్చి నవ్వుతోపాటు ఏడుపు కూడా వస్తోంది. ఆ రోజులు ఎంత అద్భుతంగా ఉండేవి. వేసవిలో మనం డాబా మీద పక్కలు వేసుకుని కబుర్లు చెప్పుకుంటూ పడుకునేవాళ్ళం. ఇంట్లో నేల మీద గుండ్రంగా కూర్చుని కొసరి కొసరి వడ్డించుకుంటూ భోజనం చేసేవాళ్ళం. ఇప్పటిలా ఇంట్లో అందరూ తలా ఓ టైమ్‌లో కంచం ఒళ్ళో పెట్టుకుని టీవీ లేదా ఫోన్ చూస్తూ, 'అది లేకపోతే తినలేం' అనే పరిస్థితి లేదప్పుడు. అయితే, అవన్నీ తీపి జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోయాయన్న ఆలోచన నన్ను బాధపెడుతోంది.

నీ మనవడు తొమ్మిది చదువుతున్నాడు. వయసు ప్రభావం అని నన్ను నేను తృప్తి పరచుకుంటున్నాను కానీ, వాడి అసహనం చూస్తే దిగులేస్తోంది. చిన్నమాట కూడా పడడు. పెద్దా చిన్నా తేడా లేకుండా ఎగిరిపడతాడు. ఇంటికే వచ్చి చదివించే ట్యూషన్ టీచర్ అంటే లెక్కలేనట్టుగా ఉంటాడు. వాడికి సహనం, సంస్కారం నేర్పే సమయం మాకు లేకుండా పోయినై.

చిన్నప్పుడు ఆటలు అయిపోయి ఇంటికి చేరాక, నువ్వెప్పుడు వస్తావా అని ఎదురు చూసేవాణ్ణి. అమ్మను మాటిమాటికీ అడిగి విసిగించేవాణ్ణి. ఎప్పుడూ కోప్పడలేదు అమ్మ. అంత ఓపిగ్గా ఎలా ఉండేదో? నీ కోడలికి ఆ ఓపికలో ఒక్క శాతం కూడా లేదు- నీ మనవడి విషయంలో. పాపం అమ్మ ఏ లోకంలో ఎలా ఉందో ఏంటో. ఆవిణ్ణి తలచుకున్నప్పుడల్లా దుఃఖం మనసుపైన దాడి చేసి నన్ను ఓడించేస్తోంది. నాకే ఇలా ఉంటే, నీ పరిస్థితి ఏంటో ఊహించగలను.

మొన్నీమధ్య ఎయిర్ ఇండియా విమానం కూలిపోయి వందల మంది చనిపోయారని తెలిసినప్పుడు నాకెందుకో జీవితం మీద అదోలాంటి విరక్తి ఏర్పడింది. తేరుకోడానికి నాలుగైదు రోజులు పట్టింది. 'ఏంటీ జీవితం' అనిపించసాగింది. మన చేతిలో

ఏదీ ఉండదు... అంతా అద్భుతంగా ఉంది అనుకుంటూండగానే అకస్మాత్తుగా జీవితం ఛిద్రమవ్వొచ్చు. నీకీ ఉత్తరం రాయడానికి ఆ ఫ్లైట్ యాక్సిడెంట్ కూడా ఓ కారణమే. నాకో విషయం బాగా తెలిసొచ్చింది. జీవితమంటే వర్తమానమే! భవిష్యత్తులోని ఒక్క నిమిషం కూడా మన చేతిలో ఉండదు. వర్తమానంలో మనం చేసిందే చేసినట్టు.

అవును నాన్నా... ఎన్నో ఏళ్ళుగా నా మనసు లోతుల్లో నిక్షిప్తమై ఉండిపోయిన ఓ విషయం నీకు భవిష్యత్తులోకాక ఇప్పుడే చెప్పాలి అనిపించింది. ఇప్పుడు కాకపోతే ఎప్పటికీ చెప్పలేకపోవచ్చు. అంత ముఖ్యమైనది అసలు ఇన్నాళ్ళుగా నీ దగ్గర దాచి ఉంచడం చాలా తప్పు. నేను చెప్పబోయేదేంటా అని నువ్వు ఉత్కంఠగా ఊపిరి బిగపట్టి మరీ చదువుతున్నావని నాకు తెలుసు... ఇంక సస్పెన్స్ వద్దులే. అదేంటో చెప్పేస్తాను. నువ్వంటే నాకు చాలా ఇష్టం నాన్నా! అది ఎంత అంటే, మాటల్లో చెప్పడానికి ప్రయత్నించడం కూడా వృథా అని స్పష్టంగా తెలిసేంత! ఇదే నేను చెప్పాలనుకున్నది.

'ఇంతేనా? ఈమాత్రం దానికే అంత బిల్డప్ అవసరమా' అని నువ్వు అనుకోవని నాకు తెలుసు నాన్నా. నీ గురించి నాకు తెలీదూ... నా ఊహ కరెక్ట్ అయితే, ఇప్పుడు నేను చెప్పిందానికి మొదట నివ్వెరపోయి, ఆ తర్వాత ఉత్తరం చదవడం ఆపి, ఎదురుగా బల్ల మీద కాళ్ళు పెట్టి, సోఫాలో వెనక్కు వాలి కళ్ళు మూసుకుని, సంతోషంతో కూడిన బాధతో నన్ను గుర్తుకు తెచ్చుకుంటావు కాసేపు.'

బల్లమీద కాళ్ళు పెట్టి కూర్చునే అలవాటు నాకు లేదు. అయినా, వాడు ఊహించినట్టే ఉత్తరం పక్కనబెట్టి, సోఫాలో తల వెనక్కు వాల్చి కళ్ళు మూసుకుని ఆలోచనల్లోకి జారిపోయాను. మనసు నిండా ఆనందంతో కూడిన పరవశం.

ఎంత ఎదిగిపోయాడు వెధవ. ఎదురుగా కూర్చుని నాతో సంభాషిస్తున్నట్టుగా రాశాడు ఉత్తరం. వాడికి నేనంటే ఇష్టమని నాకు బాగా తెలుసు. అయినా కూడా, అదే విషయం వాడింత స్పష్టంగా వ్యక్తపరుస్తూంటే ఎంత బావుంది. అందుకేనా ఏ బంధుత్వంలోనైనా కమ్యూనికేషన్ ఎంతో ముఖ్యమని చెప్పేది. అలా కాసేపు మైమరచిపోయి ఉండిపోయాక, తడి కళ్ళను తుడుచుకుంటూ ఉత్తరం చదవడం



కొనసాగించాను.

'నేను చెప్పినట్టే చిన్న ఇంటర్వెల్ తర్వాత ఉత్తరం మళ్ళీ చదవడం మొదలుపెట్టావా? వెరీ గుడ్. నువ్వు సరిగ్గా పట్టించుకుంటావో లేదో తెలీదు. నా వయసు ఇప్పుడు నలభై ఐదు. ఆఫీసులో పని ఒత్తిడి బాగా పెరిగి, ఇంట్లో వారి మీద అరవడం, విసుక్కోవడం ఎక్కువైంది. అది తప్పని తెలుస్తూనే ఉంటుంది కానీ ఏమీ చేయలేకపోవడం కూడా బాగా తెలుస్తోంది. ఆవేశం తగ్గాక వచ్చే సరైన ఆలోచనలు నన్ను అపరాధ భావంతో బాధపెడుతున్నాయి. ఒక్కోసారి 'నన్ను ఎవరూ అర్థం చేసుకోరు' అని బలంగా అనిపిస్తోంది.

ఆరు నెలల క్రితం నువ్వు ఇక్కడకు వచ్చినప్పుడు కూడా చాలా చిన్న చిన్న విషయాల గురించి నీ మీదా అరిచేశాను. ఎంతో నొచ్చుకుని ఉంటావు. నేను చేసింది ముమ్మాటికీ తప్పే. అయితే, ఒక్క విషయం నాన్నా... నేను చూపిన అసహనం, విసుగు వెనకున్న ఏకైక కారణం నీమీద నాకున్న చనువు. ఆ చనువుకు పునాది నీ మీద నాకున్న స్వచ్ఛమైన ప్రేమ మాత్రమే. అంటే, నేనెప్పుడైనా నీ మీద విసుగు ప్రదర్శించానూ అంటే, నీ మీదున్న ప్రేమను ప్రేమగా ప్రకటించాను అని అర్థం. ఇదే సూత్రం మీ కోడలి విషయంలోనూ వర్తిస్తుంది. తనకిదంతా ఎన్నోసార్లు చాలా స్పష్టంగా చెప్పి నన్ను అర్థం చేసుకోమని కోరాను. తన వల్ల కాలేదు. ఇంట్లోవారి మీద నేను చూపే విసుగుకు కారణం వాళ్ళంటే నాకున్న చులకన భావం అని తప్పుగా అనుకుంటుంది. కానీ నువ్వు మటుకు నన్ను సరిగ్గా అర్థం చేసుకుంటావని నాకు తెలుసు నాన్నా.

అలా అని, నేను చేసింది మంచిపనే అని సమర్థించుకోవటం లేదు. నేను చేసిన తప్పులో కూడా నా ప్రేమ కనబడుతోంది చూడమని చెబుతున్నాను. అలా చూడగలిగితే, ఇంట్లోవారి తప్పుల్ని పట్టించుకోకుండా ఉండటం లేదా క్షమించడం తేలికవుతుంది. నిజానికి, నీకు నా మీదున్న అధికారానికి నువ్వు కూడా గొంతు పెంచి నన్ను కోపంగా తిట్టి 'నేను చేసేది తప్పు' అని అప్పటికప్పుడు చెప్పి ఉండొచ్చు. అలా జరిగి ఉంటే నాకు చాలా సంతోషంగా ఉండేదేమో. నా విసుగును నువ్వు మౌనంగా భరించడమే నాకు భరించలేనిదిలా తయారైంది.

సరే, ఇంతకీ ఈ ఉత్తరం- ఇదంతా చెబుతున్నది- ఎందుకనుకున్నావ్... నిన్నో కోరిక కోరడానికి. నువ్వు 'కాదంటావన్న' అభిప్రాయంతోనే ఇంత వివరమైన ఉపోద్ఘాతం రాయాల్సి వచ్చింది... 'ఏమిటా కోరిక' అని నువ్వు ఆశ్చర్యంలోంచి తేరుకునేలోపు చెప్పేస్తాను... 'నువ్వూ ఊరొదిలి మా దగ్గరే ఉండిపోడానికి వచ్చేయ్ నాన్నా'- ఇదే నా కోరిక.

నేనిక్కడ సిటీలో ఉండాల్సిన ఆర్థిక అవసరం మనకు లేకపోతే, ఏది ఏమైనా సరే, మేమంతా అక్కడికే వచ్చి నీతోనే ఉండిపోయేవాళ్ళం. నీకెన్నోసార్లు చెప్పాని విషయం.

'మనమంతా కలిసి ఒకచోట, ఒకే ఇంట్లో ఉంటే ఎంత బావుంటుంది' అన్న ఊహకే నా మనసు పులకరిస్తోంది. నీకు అక్కడే

బావుంటుంది అని నాకు తెలుసు. కానీ అందుకు గల కారణాలే నాకు కొరుకుడు పడవు. నీకు నచ్చేది అక్కడి ఇల్లూ స్నేహితులూ వాతావరణం కావొచ్చు. అయితే అవి మన ఆప్యాయత, అనుబంధంకన్నా ఎక్కువా? మనం ఒకరినొకరం కనిపెట్టుకుని ఉంటూ, సరదాగా, ప్రేమగా గడిపే జీవితంకన్నా నీకవి ఎక్కువా నాన్నా? 'మీ పనుల్లో మీరుంటే అక్కడ నాకేమి తోస్తుంది?' అంటావా? మనం ప్రతీరోజూ తీరిగ్గా కూర్చుని కబుర్లు చెప్పుకోనవసరం లేదు. స్వచ్ఛమైన ఆత్మీయతతో కూడిన కుటుంబసభ్యుల 'ఉనికి' మనకు చాలదూ? మాట్లాడుకుంటేనే పట్టించుకున్నట్టా... కాదు కదా!

అమ్మ జీవించి ఉండగా విషయం వేరు. అప్పుడు మీ ఇద్దరూ ఒకరికొకరు తోడున్నారన్న తృప్తి నాకుండేది. ఇప్పుడు నువ్విలా ఒంటరిగా, మాకు దూరంగా ఉండటం సరికాదు. ఇక్కడకు వచ్చేసి, రెండుమూడు నెలలకోసారి అక్కడకు వెళ్ళి స్నేహితులని కలిసి కొద్ది రోజులు గడిపి రావొచ్చు. అక్కడ మన ఇల్లు ఎవరికీ ఇవ్వకుండా నీకోసమే ఉంచేద్దాం.

ఇక్కడ మన ఇంట్లో నీకో గది కేటాయిస్తామని చెప్పా కదా. ఇక్కడే ఉండి చక్కటి ఆరోగ్యవంతమైన దినచర్య అలవాటు చేసుకో. ఉదయాన్నే మేమంతా వాకింగ్‌కు వెళ్తాం- ఫోన్ తీసుకెళ్ళకుండా! నువ్వు కూడా మాతోపాటు వస్తే ఎంత బావుంటుంది... ఆలోచించు. ఇంట్లోవారితో సరదాగా నడుస్తూ, ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు దూరంగా, కబుర్లు చెప్పుకుంటూ, ఒకరితో ఒకరు నడవటంలో పోటీ పడుతూ, నగరంలోని వేకువజాము అందాలను వీక్షిస్తూ... ఇంతకు మించిన ఆనందం ఇంకేమైనా ఉంటుందా అని ఆలోచించటం కూడా అవసరం కదూ...

సొంత ఊళ్ళోనే ఉండటం, ఉండగలగడం నిజంగా అదృష్టమే, కాదని ఎవరూ అనరు. అలాంటి అదృష్టం నువ్వు ఎన్నో ఏళ్ళు అనుభవించావు. ఇక ఇప్పుడు మాతో ఉండిపో నాన్నా. ఎందుకంటే, సొంత ఊళ్ళో ఉండటంకన్నా తల్లిదండ్రులతో కలిసి ఉండటమే నిజమైన అదృష్టం. అలాంటి అదృష్టాన్ని నువ్వు మాకు ఇకమీదటనైనా కలిగించవూ?

గతంలోలా నేల మీద హాయిగా బాసింపట్టు వేసుకుని కూర్చోవడం కుదరకపోయినా, డైనింగ్ టేబుల్ మీద ఫోన్, టీవీలకు దూరంగా, కబుర్లు చెప్పుకుంటూ నీతో కలిసి భోజనం చేయాలని ఉంది ప్రతి రోజూ!

నీ మనవణ్ని నువ్వు తేలిగ్గా దారిలో పెట్టగలవు. చిన్నప్పుడు నాకు నేర్పినట్టే వాడికి కూడా మంచి బుద్ధులు నేర్పి సరైన మార్గం చూపవా నాన్నా... ఈ విషయంలో నువ్వుకాక నాకింకెవరైనా సాయపడగలరా? ఇక్కడ 'సాయం' అన్న పదం సరైనదేనా? మనసుపెట్టి ఆలోచించు.

అమ్మ మనతో లేదనే ఆవేదనా లోటూ మనమిద్దరం తప్ప ఇంకెవరైనా పంచుకోగలరా? ఈ పని మనం ఫోన్‌లో చేయగలమా చెప్పు? మనమిద్దరం ఒకరికొకరం తోడుగా ఉండొద్దూ.

పని ఒత్తిడివల్లో లేక మరో కారణంవల్లో మీ కోడలికీ నాకూ మనస్పర్ధలు వస్తే,



నువ్వు మాకో పెద్ద దిక్కుగా ఉండి ఇద్దరికీ సర్దిచెప్పొచ్చు కదా. నువ్వంటే తనకి ఎంతో గౌరవం. ఆఫీసు విషయాలు ఇంటికి తెచ్చి మనసు పాడుచేసుకోవడం మంచిది కాదు అని తెలుసు కానీ, దాన్ని పాటించడానికి కావాల్సిన ప్రేరణ లేదేమో అనిపిస్తుంది. నువ్వు కూడా ఇక్కడే మాతోపాటు ఉంటే, నేను కచ్చితంగా మారతాను అని నా నమ్మకం. నువ్వు మాతోనే ఉండిపోవటం కన్నా గొప్ప ప్రేరణేదీ నాకు తెలిసి లేదు.

మా అందరికీ దూరమై ఎందుకొచ్చిన ఒంటరి జీవితం నాన్నా నీకు? అర్జెంటుగా ఇక్కడకు వచ్చేయ్.

చెప్పడం మరిచాను. నీలాగే రైల్వేలో పనిచేసి రిటైర్ అయిన ఓ పెద్దమనిషి మా ఇంటి పక్కనే ఉంటాడు. నీకు మంచి కాలక్షేపం.

ఇక ముగిస్తాను. ఇంత పెద్ద ఉత్తరానికి జవాబు ఏమివ్వాలా అని ఎక్కువగా ఆలోచించకు. 'రేయ్, వచ్చేస్తున్నాను' అన్న చిన్న జవాబు చాలు. ఇది తప్ప ఇంకేది రాసినా, చెప్పినా నీకు ఇంకో ఉత్తరం రాయాల్సి ఉంటుంది జాగ్రత్త!

ఉంటాను మరి.

గోపి

★ ★ ★


ఉత్తరం చదవడం పూర్తి చేసి బాధగా మూలిగాను. చేతులు సన్నగా వణకడం తెలుస్తోంది. కళ్ళు తుడుచుకుని లేచి నిలబడి ఇంట్లో పచార్లు చేయసాగాను. ఉద్వేగంతో కూడిన దుఃఖాన్ని నియంత్రించడం నావల్ల కావడం లేదు.


గోపీ, మా అబ్బాయి కాదు. రాసింది కూడా నాక్కాదు... పక్క వీధిలో ఉండే రైల్వేలో పనిచేసి రిటైర్ అయిన ఓ పెద్దాయనకి వాళ్ళ అబ్బాయి చెప్పిన ఉత్తరం అది. మా పేర్లు ఒకటే కావడం, మా ఇంటి నంబర్లలో కేవలం ఒక అంకె మాత్రమే తేడా ఉండటంతో పోస్ట్‌మేన్ పొరపాటున ఉత్తరం మా ఇంట్లో వేసి పోయినట్టున్నాడు. ఉత్తరంలో చెప్పిన విషయాలన్నీ మా ఇంట్లో జరిగినట్టుగానే, మా అబ్బాయి చెబుతున్నట్టుగానే ఉండటంతో 'రాసింది నాకు కాదు' అన్న అనుమానమే ఎక్కడా రాలేదు. చివర్లో రైల్వే ఉద్యోగం అన్నప్పుడే అర్థమైంది అది ఏ అడ్రస్‌కు వెళ్ళాల్సిన ఉత్తరమో.

నా దుఃఖానికి కారణం ఉత్తరం నాకు రాలేదని కాదు. ఉత్తరం చదవాల్సిన పెద్దాయన రెండ్రోజుల క్రితమే గుండెనొప్పితో పోయాడు- ఉత్తరం చదవకుండానే.

స్నేహితుడి కొడుకు పెళ్ళికని వెళ్ళి నేను నాలుగు రోజులుగా ఇంట్లో లేకపోవడంతో ఉత్తరం నా చేతికందడం ఆలస్యమైంది. అంతలోనే ఎంత పని జరిగింది!

ఆలోచనల్లో, దుఃఖంలో మునిగిపోయి తేరుకోడానికి చాలా సమయమే పట్టింది. మొదట వాళ్ళబ్బాయి గోపీకి- జరిగిన పొరబాటు తెలియజేసి ఉత్తరం తిరిగి ఇచ్చేద్దామని అనుకున్నాను. అలా చేస్తే తను రాసింది తండ్రి చదవలేదని అతడికి రూఢీగా తెలిసిపోతుంది. 'తండ్రి తన ఉత్తరం చదివాకే పోయాడేమో' అని అతడు ఏ కోశాన్నైనా అనుకుంటూ తృప్తిపడుతున్నాడేమో... నేనెందుకు అతడికా తృప్తి లేకుండా చేయాలి? ఇలా ఆలోచించి చివరకు ఆ ఉత్తరం నా దగ్గరే ఉంచేయాలని నిర్ణయించుకున్నాను. అంతే కాదు, మరో నిర్ణయం కూడా తీసుకున్నాను... ఉన్నపళంగా ఊరు విడిచి మా అబ్బాయి దగ్గరకు శాశ్వతంగా వెళ్ళిపోవాలని! ★





చక్కెర... పలుకుల్లోనే కాదు, ఆ పదంలోనూ తీయదనం ఉంటుంది. ఆ చక్కెరని దేని నుంచి తయారు చేస్తారని ఎవరైనా అడిగితే, ఏమాత్రం ఆలోచించకుండా 'చెరకు' పేరే చెబుతాం. కానీ పంచదార తయారీ కోసం 'చక్కెర దుంపల' రూపంలో మరో ప్రత్యామ్నాయమూ అందుబాటులో ఉంది. మనదేశంలోనూ కొత్తగా సాగవుతున్న ఈ 'బీట్ షుగర్' విశేషాలు తెలుసుకుందాం.

పంచదార దుంపలు... పండించేస్తున్నారు!





ఇప్పటి మాట కాదు, 1800ల నాటి విషయం... యూరప్ దేశాలన్నీ నిత్యావసరమైన చక్కెర కోసం బ్రిటన్‌పైనే ఆధారపడేవి. ఈ విషయంలో బ్రిటన్ ఆధిపత్యానికి అడ్డుకట్టవేయాలనుకున్న ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్, తమ దేశంలో చెరకు పెద్దగా పండదు కాబట్టి- ప్రత్యామ్నాయం కోసం వెతకమని సైంటిస్టులనీ, ప్రజలనీ ఆదేశించాడు. అప్పుడే... బీట్ షుగర్ లేదా చక్కెర దుంపల గురించి ప్రపంచానికి తెలిసింది. చూడ్డానికి పాలకూరలాంటి ఆకులతో, ముల్లంగిని తలపించే ఆకృతితో వింతగా ఉంటుందీ బీట్ షుగర్. చెరకులానే దీనిలో కూడా సుక్రోజ్ శాతం ఎక్కువ. అందుకే ఆ గుజ్జుని పాకం పట్టి చక్కెర తయారుచేయొచ్చని శాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. అలా, చిన్నగా మొదలైన ఈ 'దుంప' చక్కెర ఉత్పత్తి ప్రస్తుతం ఏ స్థాయికి వెళ్లిందో తెలుసా? అమెరికాలో సాధారణ చక్కెర వాడకం తగ్గిపోయి, బీట్ షుగర్ వినియోగం 58 శాతానికి చేరుకుందట. ఒక్క అమెరికానే కాదు రష్యా, ఫ్రాన్స్, జర్మనీ, తుర్కియే, పోలండ్, జపాన్, చైనా సహా 50 దేశాలు దీన్ని ప్రధాన పంటగా పండిస్తున్నాయి. ఇలా అగ్ర దేశాలన్నీ పంచదార కోసం చెరకు నుంచి చక్కెర దుంపవైపు మళ్లడానికి ప్రధాన కారణం... ఇందులోని వ్యవసాయ, వాణిజ్య ప్రయోజనాలే.

నాలుగు నెలల్లోనే...

చెరకు పంట చేతికి రావాలంటే కనీసం ఏడాది పడుతుంది. పైగా నీళ్లు పుష్కలంగా ఉన్న నేలల్లోనే పండుతుంది. తెగుళ్ల బెడదా, క్రిమి సంహారకాల ఖర్చూ ఎక్కువే. చెరకు పంటతో ఉన్న ఈ ఇబ్బందులను చక్కెర దుంప తనకు అనుకూలంగా మార్చుకుంది. ఇది నాలుగు నెలల్లోనే చేతికొచ్చేస్తుంది. ఎలాంటి నేలలో అయినా తేలిగ్గా పండేస్తుంది. పంట వ్యర్థాలంటూ పెద్దగా ఉండవు. చెరకు మాదిరిగానే ఈ దుంపల నుంచీ మొలాసిస్... దాన్నుంచి ఇథనాల్ తయారు చేస్తున్నారు. వాటి వ్యర్థాలని బిల్డింగ్ మెటీరియల్‌గా వాడుకోవచ్చు. రోడ్ల నిర్మాణంలో కూడా ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇక, దుంపల నుంచి వచ్చిన పిప్పిని ప్రాసెస్ చేసి వంట చెరకుగా వాడుతున్నారు. ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఈ దుంప ఆకులకి మేలురకం పశుగ్రాసంగా మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. ఫార్మా, కాస్మెటిక్స్ రంగాల్లో దుంప చక్కెర వినియోగం బాగా పెరుగుతోంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే, చాలా దేశాలు చెరకుకు వీడ్కోలు చెప్పి బీట్ షుగర్ సాగువైపు మొగ్గు చూపుతున్నాయి.

తెలుగు ప్రాంతాల్లోనూ...

అచ్చమైన చక్కెర దుంపలో 75 శాతం వరకూ నీరే ఉంటుంది. కెలోరీలూ, కొవ్వూ ఉండవు... యాంటీ ఆక్సిడెంట్లు అపారం. జీర్ణవ్యవస్థకు మేలు చేసే ప్రీ-బయోటిక్స్ కూడా లభిస్తాయి. అధిక రక్తపోటును అదుపులో ఉంచే గుణమూ ఉందని చెబుతారు. చక్కెరగా మార్చిన తర్వాత మాత్రం... ఆ ప్రయోజనాలేవీ మిగలవు. మధుమేహ రోగులైతే... చెరకుతో చేసిన చక్కెర విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటారో, బీట్ షుగర్‌తోనూ అంతే జాగ్రత్తగా ఉండాలి. రక్తంలోని గ్లూకోజ్ స్థాయి మీద కూడా బలంగానే ప్రభావం చూపుతుంది. ఇప్పటికే పంజాబ్‌లో కొందరు రైతులు పార్టీ ఫిరాయించారు. చక్కెర దుంపను పండించి లాభాలు ఆర్జిస్తున్నారు. వారి స్ఫూర్తితోనే లఖ్‌నవూ చెరకు పరిశోధనా కేంద్రం... పంజాబ్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల్లో ఈ పంటను పండించేందుకు రైతులను ప్రోత్సహిస్తోంది. 'తెలుగు రాష్ట్రాల్లో కూడా రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే ప్రాంతాలు బీట్ షుగర్‌ని పండించడానికి అనుకూలంగా ఉంటాయి. అందుకే హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, సంగారెడ్డిలోని బసంత్‌పూర్ వ్యవసాయ పరిశోధనా క్షేత్రంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో ఉన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలోనూ ఈ పంటను ప్రయోగాత్మకంగా పండిస్తున్నాం. రాబడి ఎక్కువ, పెట్టుబడి తక్కువ కాబట్టి రైతులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు' అంటున్నారు బసంతపూర్ వ్యవసాయ పరిశోధనాక్షేత్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్.

సహకారం: పులి అనిల్‌రెడ్డి, ఈనాడు, సంగారెడ్డి





ఈ ఫొటో ఫ్రేములు... మాయ చేస్తాయి

అన్నీ ఫొటో ఫ్రేములే. చూడటానికి సాదాసీదాగా కనిపించినా మాయ చేస్తాయి. మిరుమిట్లు గొలుపుతాయి, ఆశ్చర్యపరుస్తాయి. అన్నింటికీ మించి ఈ రోజులకు మ్యాచ్ అయ్యేలా ఇంటికి కొత్త అందాన్ని కూడా తెస్తాయి. మరి, అవేంటో చూసేద్దామా...





మధుర జ్ఞాపకాలుగా...

ప్రియమైనవారి ఫొటోల్నీ, ప్రత్యేక సందర్భాల్లో క్లిక్‌మనిపించిన అరుదైన ఘట్టాల్నీ ఫ్రేముల్లో అమర్చుకుని అప్పుడప్పుడూ చూసుకుంటుంటే మహా ఆనందం కలుగుతుంది. కాబట్టే, తయారీదారులు ఆ ఫొటోలకు టెక్నాలజీని జోడించి ఇదిగో ఇలా '4డీ మ్యాజిక్ ఫొటో ఫ్రేములు'గా మార్చారు. అంటే... ఇది చూడ్డానికి సాధారణ ఫొటోఫ్రేములా కనిపిస్తూనే, సగం చిత్రంతో లేదా పెన్సిల్ ఆర్ట్‌తో వస్తుంది. ఒక్కసారి స్విచ్ ఆన్ చేశామా... ఆ ఫొటోలో లైటు వెలగడంతోపాటు బ్యాక్‌గ్రౌండ్‌లో దాగున్న వ్యక్తులూ, లైట్లూ, చెట్లూ... ఇలా అన్నీ ప్రత్యక్షమై పూర్తి ఫొటోఫ్రేమ్‌గా మారిపోతాయి. వీటిని నచ్చినట్లుగా కస్టమైజ్ చేయించుకోవచ్చు కూడా.










అద్దం... వర్ణరంజితం

ఓ సాదా ఫొటో ఫ్రేము చిటికె వేసినంత సులువుగా వెలుగులు విరజిమ్మే ఆర్ట్ పీస్‌లా మారిపోతే... పెద్దగా కష్టపడకుండానే ఇంటిని మెరిపించేయొచ్చు కదూ! ఆ ప్రత్యేకతని కోరుకునేవారి కోసం ఇప్పుడు 'ఎల్‌ఈడీ లైట్ పెయింటింగ్ నైట్‌లైట్ అండ్ ఫొటో ఫ్రేమ్స్' వస్తున్నాయి. ఇవి చూడ్డానికి సాదా అద్దంలా కనిపిస్తాయా... స్విచ్ వేసిన మరుక్షణమే, ప్రకృతి అందాల్ని విరజిమ్ముతూ కళ్లను కట్టిపడేస్తాయి. ఈ అందాల్లో రంగురంగుల జలపాతాలూ, కొమ్మల్లో వాలిన పక్షులూ, సముద్రపు ఒడ్డున మెరిసే గులకరాళ్లూ, పచ్చని సెలయేళ్లూ, ఆకట్టుకునే చెట్లూ.... ఇలా ఎన్నెన్నో ఉంటాయి. ఆ సోయగాల సౌందర్యాన్ని ఇంకాస్త రెట్టింపు చేసుకునేందుకు ఈ ఫ్రేముల వెలుతురును రెండు మూడు రంగుల్లోకి మార్చుకుంటూనే... పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు కూడా. అవసరం లేదనుకుంటే స్విచ్ ఆఫ్ చేసి సాధారణ అద్దంలా మీ సొగసులకు మెరుగులు దిద్దుకోవచ్చు.





సూర్యకిరణాలు పడేలా...


మందపాటి కాగితంపైన పెన్‌తోనో, పెన్సిల్‌తోనో ఓ బొమ్మ గీసి, ఫ్రేమ్‌లో పెట్టినట్లుగా ఉంటాయీ ఫొటో ఫ్రేములు. మొదటిసారి చూస్తే ఇందులో ఏ ప్రత్యేకతా లేదనిపిస్తుంది. కానీ, ఒక్క స్విచ్‌తో వీటిలో సూర్యకిరణాలు ప్రసరిస్తాయి. అదే ఈ 'త్రీడీ ఎల్‌ఈడీ ఫొటో ఫ్రేమ్ సన్‌సెట్ పెయింటింగ్ విత్ లైట్' ప్రత్యేకత. అవును, వీటిలో అమర్చిన రిమోట్ కంట్రోల్ ద్వారా, ఆ సూర్యరశ్మిని పెంచుకోవచ్చు, తగ్గించుకోవచ్చు. అంతేకాదు, ఇంద్రధనుస్సులోని రంగులన్నీ కనిపించేలా చేసుకోవచ్చు కూడా. నట్టింట్లోని సోఫాల మీదుగా పడే పచ్చని చెట్ల నీడ, మెట్లమార్గంలో ప్రసరించే కృత్రిమ సూర్యకిరణాలూ... ఇలా ఎన్నో ప్రత్యేకతలతో నిజంగానే ఎండ పడుతోందా అన్నంత సహజంగా కనిపిస్తాయీ ఫ్రేములు.













ఆదివారం వచ్చిందంటే మాంసాహార ప్రియులకు మటన్‌ను మించిన ఛాయిస్ ఉంటుందా... అది కూడా వైవిధ్యమైన రుచులతో నోరూరిస్తే... విందు అదిరిపోదూ! ఆలస్యమెందుకు, ఆ వంటకాలేవో వండేద్దాం రండి.

మజా మజా మటన్!



మఖనీ మటన్



తయారీ విధానం: ముందుగా మారినేషన్ కోసం పెట్టుకున్న పదార్థాలు, అరచెంచా ఉప్పు, మటన్ ముక్కల్ని ఓ గిన్నెలో వేసుకుని అన్నింటినీ బాగా కలుపుకోవాలి. అరగంట తర్వాత, స్టవ్‌మీద కడాయిని పెట్టి రెండు చెంచాల నూనె వేసి మటన్ ముక్కల్ని వేయించి, కప్పు నీళ్లు పోయాలి. మటన్ చక్కగా ఉడికాక దింపేయాలి. స్టవ్‌మీద మళ్లీ కడాయిని పెట్టి మిగిలిన నూనె వేసి యాలకులు, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు, పచ్చిమిర్చి, టొమాటో ముక్కలు వేయించాలి. టొమాటో కాస్త మగ్గాక ఈ మిశ్రమాన్ని మాత్రమే మిక్సీలో వేసుకుని మెత్తగా చేసుకోవాలి. ఇప్పుడు అదే కడాయిలో వెన్న వేసి... అల్లంవెల్లుల్లి పేస్టు, అప్పటికే సిద్ధం చేసుకున్న కాజూ పేస్టు, మటన్ ముక్కలు, గరంమసాలా, టొమాటో కెచప్, కొత్తిమీర తరుగు, కారం, తగినంత ఉప్పు వేసి... బాగా కలిపి పావుకప్పు నీళ్లు పోయాలి. ఇది ఉడికి చిక్కగా అవుతున్న సమయంలో కసూరీమేథీ, క్రీమ్ వేసి రెండు నిమిషాల తర్వాత దింపేయాలి.

కావలసినవి: **మటన్:** అరకిలో, **నూనె:** పావుకప్పు, **టొమాటోలు:** మూడు, **యాలకులు:** నాలుగు, **ఉల్లిపాయలు:** రెండు, **జీడిపప్పు:** ఇరవై, **పచ్చిమిర్చి:** నాలుగు, **వెన్న:** టేబుల్‌స్పూను, **అల్లంవెల్లుల్లి పేస్టు:** చెంచా, **గరంమసాలా:** చెంచా, **కారం:** చెంచా, **టొమాటో కెచప్:** రెండు చెంచాలు, **కొత్తిమీర తరుగు:** రెండు టేబుల్‌స్పూన్లు, **కసూరీ మేథీ:** పెద్ద చెంచా, **క్రీమ్:** రెండు టేబుల్‌స్పూన్లు, **ఉప్పు:** తగినంత.

మారినేషన్ కోసం... **కారం:** చెంచా, **అల్లం వెల్లుల్లి పేస్టు:** టేబుల్ స్పూను, **పెరుగు:** అరకప్పు.

మేథీ మటన్

కావలసినవి: **మటన్ ముక్కలు:** ముప్పావుకిలో, **నూనె:** పావుకప్పు, **ఉల్లిపాయలు:** మూడు, **వెల్లుల్లి తరుగు:** టేబుల్‌స్పూను, **అల్లం తరుగు:** టేబుల్‌స్పూను, **పసుపు:** చెంచా, **దనియాల పొడి:** చెంచా, **గరంమసాలా:** చెంచా, **కారం:** పెద్ద చెంచా, **ఉప్పు:** తగినంత, **టొమాటోలు:** మూడు, **మెంతికూర:** పెద్ద కప్పు, **పాలకూర తరుగు:** అరకప్పు.

తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేసి ఉల్లిపాయ ముక్కల్ని ఎర్రగా వేయించి... అల్లం-వెల్లుల్లి తరుగు, పసుపు, దనియాలపొడి, గరంమసాలా, కారం, ఉప్పు వేసి కలపాలి. ఇప్పుడు మటన్ ముక్కలు, టొమాటో తరుగు జోడించి... బాగా వేయించాక ఒకటిన్నర కప్పుల వేడి నీళ్లు పోసి మూత పెట్టాలి. పది నిమిషాల తర్వాత పాలకూర తరుగు, మెంతికూర వేసి, మధ్యమధ్య కలుపుతూ ఉండాలి. మటన్ పూర్తిగా ఉడికి, నీళ్లన్నీ ఆవిరై, కూర బాగా వేగాక దింపేయాలి.



పెప్పర్ ఫ్రై

కావలసినవి: మటన్ ముక్కలు: రెండు కప్పులు, నూనె: పావుకప్పు, మిరియాలపొడి: టేబుల్‌స్పూను, పెరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, ఎండుమిర్చి: మూడు, వినెగర్: చెంచా, ఉల్లిపాయలు: మూడు, నేతిలో వేయించిన జీడిపప్పు పలుకులు: పావుకప్పు, టొమాటో: ఒకటి, నెయ్యి: టేబుల్‌స్పూను, ఉప్పు: తగినంత.

తయారీ విధానం: మటన్ ముక్కలపైన వినెగర్, పెరుగు, తగినంత ఉప్పు వేసి కలిపి పెట్టుకోవాలి. అరగంట అయ్యాక ఈ ముక్కల్ని కుక్కర్‌లో వేసి, సరిపడా నీళ్లు పోసి నాలుగు కూతలు వచ్చేవరకూ ఉడికించుకోవాలి. ఇప్పుడు స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు, ఎండుమిర్చి వేయించుకుని టొమాటో తరుగు, మిరియాలపొడి, మరికొంచెం ఉప్పు, మటన్ ముక్కలు, నెయ్యి వేయాలి. అన్నీ బాగా వేగాక... జీడిపప్పు పలుకులు వేసి కలిపి దింపేయాలి.

కట్‌లెట్



కావలసినవి: **మటన్ కీమా:** అరకిలో, **అల్లంవెల్లుల్లి పేస్టు:** చెంచా, **పచ్చిమిర్చి పేస్టు:** చెంచా, **ఉల్లిపాయలు:** రెండు, **పసుపు:** అరచెంచా, **కారం:** చెంచా, **జీలకర్ర పొడి:** చెంచా, **దనియాలపొడి:** చెంచా, **ఉప్పు:** తగినంత, **గరంమసాలా:** చెంచా, **ఉడికించిన బంగాళాదుంపలు:** మూడు, **కొత్తిమీర తరుగు:** పావుకప్పు, **నిమ్మకాయ:** సగం చెక్క, **గుడ్లు:** రెండు, **బ్రెడ్‌పొడి:** కప్పు, **నూనె:** వేయించేందుకు సరిపడా.

తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి రెండు చెంచాల నూనె వేసి... అల్లంవెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చి పేస్టు వేయించాలి. తర్వాత ఉల్లిపాయ ముక్కల్నీ ఎర్రగా వేయించి, కీమా వేయాలి. ఇప్పుడు పసుపు, కారం, జీలకర్రపొడి, దనియాలపొడి, తగినంత ఉప్పు, గరంమసాలా వేసి కలిపి మూత పెట్టాలి. కీమా ఉడికాక కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి దింపేయాలి. ఇందులో ఉడికించిన బంగాళాదుంపల ముద్ద వేసి కలిపి, కొద్దికొద్దిగా తీసుకుని కట్‌లెట్‌లా చేసుకోవాలి. వీటిని ముందు గుడ్డుసొనలో, తర్వాత బ్రెడ్‌పొడిలో ముంచి రెండుమూడు చొప్పున కాగుతున్న నూనెలో వేసి, వేయించుకుని తీసుకోవాలి.

సిసింద్రీ


ఎక్కడబ్బా?

పూల బుట్ట చాలా అందంగా ఉంది కదా! అందులో ఎనిమిది కీటకాలు దాగి ఉన్నాయి. అవి ఏవో, ఎక్కడున్నాయో కనిపెట్టండి చూద్దాం.




సాధించగలరా?

ఇక్కడ నాలుగు రకాల ఆకారాలు గజిబిజిగా ఉన్నాయి. అయితే, బొమ్మలో చూపినట్లు... ఆ నాలుగింటినీ ఒక జట్టుగా- మిగతా వాటి నుంచి వేరు చేయగలరా?




దారి కనుక్కోండి

తోటలోని పువ్వుపైన వాలేందుకు మూడు సీతాకోకచిలుకలు పోటీపడుతున్నాయి. అయితే, వాటిలో ఒక్కటి మాత్రమే అక్కడికి చేరుకోగలదు. అది ఏదో చెప్పండి చూద్దాం.



జత చేయండి

తన పుట్టినరోజున స్నేహితులను ఇంటికి పిలిచాడు రాము. వాళ్లకు ఇష్టమైన ఐస్‌క్రీమ్‌లను తెప్పించి ఇచ్చాడు. ఇంతకీ ఏ కప్‌లో ఏ రంగులు ఉన్నాయో గుర్తించి, జత చేయండి చూద్దాం.



తేడాలేంటి?

ఇక్కడున్న రెండు బొమ్మల మధ్య ఎనిమిది తేడాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి.





రుజువు దొరికింది!

వల్లభి నగరం వర్తకానికి ప్రసిద్ధి. ఒకరోజు దూర ప్రాంతం నుంచి సాంబయ్య అనే వ్యక్తి ఆ నగరానికి వెళ్లాడు. తన దగ్గర ఉన్న అయిదొందల రూపాయలతో ఏదైనా సామగ్రిని కొందామనుకున్నాడు. ఇంతలో ఒక మహిళ సాంబయ్య చేతిని గట్టిగా పట్టుకొని, 'నా డబ్బు కాజేసి పారిపోదామని అనుకుంటున్నావా?' అంటూ దబాయించింది. 'నువ్వెవరో కూడా నాకు తెలియదు. ఇది నా డబ్బు' అని గట్టిగానే బదులిచ్చాడు సాంబయ్య. మాటామాటా పెరగడంతో జనం పోగయ్యారు. 'న్యాయాధికారి దగ్గరకు వెళ్లండి. ఆయనే మీ సమస్యను పరిష్కరిస్తాడు' అని సలహా ఇచ్చాడు ఓ వ్యక్తి.





సరేనంటూ సాంబయ్యను న్యాయాధికారి కార్యాలయానికి లాక్కెళ్లిందామె. ఇద్దరూ తమ వాదనలు వినిపించారు. ఆ మహిళ అబద్ధం చెబుతున్నట్టు న్యాయాధికారికి అర్థమైపోయింది. దాన్ని ధ్రువీకరించుకునేందుకు ఓ చిన్న నాటకం ఆడాడు. 'నీ మాటలు నమ్మాలనిపించడం లేదు. ఆమె డబ్బు ఆమెకు ఇవ్వు' అని సాంబయ్యను ఉత్తుత్తిగా ఆదేశించాడు. చేసేది లేక ఆమె చేతుల్లో డబ్బు పెట్టాడు సాంబయ్య. ఆ తర్వాత సాంబయ్యను పిలిచి.. 'ఆమె వెనకాలే వెళ్లి, డబ్బు లాగేసుకో. మిగతాది నేను చూసుకుంటా' అని రహస్యంగా చెప్పాడు న్యాయాధికారి. సాంబయ్య అలానే చేయబోయాడు. కానీ, ఆమె ఎంతకూ పట్టు విడవలేదు. మళ్లీ న్యాయాధికారి వద్దకు వెళ్లి 'అయ్యా! మీరు నాకు ఇప్పించిన డబ్బును ఇతను లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నాడు' అంటూ ఫిర్యాదు చేసింది. 'నిజంగానే నీ డబ్బు లాగేసుకున్నాడా?' అని రెట్టించాడు న్యాయాధికారి. 'లేదు. నేను లాక్కోనివ్వలేదు. బలంగా అడ్డుకున్నాను' అని బదులిచ్చిందామె. 'నా అనుమానమే నిజమైంది. సాంబయ్య దుర్బలుడు. నీ నుంచి బలవంతంగా డబ్బు లాగేసుకునే శక్తి అతనికి అప్పుడూ లేదు, ఇప్పుడూ లేదు. ఆ అమాయకుడి డబ్బు కాజేయడానికి నువ్వే అబద్ధం ఆడినట్లు తేలిపోయింది' అంటూ తీర్పు ఇచ్చాడు న్యాయాధికారి. తన తప్పును ఒప్పుకుని.. మరోసారి పరుల సొమ్ముకు ఆశ పడనంటూ క్షమాపణ కోరిందామె.

చెప్పగలరా?

సెలవు రోజు కావడంతో సరదాగా పెయింటింగ్ వేస్తున్నాడు హరి. అంతా అయిపోయాక, ఒక ఆకును మాత్రం గీయకుండా వదిలేశాడు. తను గీయాల్సిన ఆకు ఏదో చెప్పగలరా?








జవాబులు


దారి కనుక్కోండి: B

జత చేయండి: 1-D, 2-B, 3-A, 4-C.

చెప్పగలరా?: నాలుగో వరుసలో మూడో ఆకు.

తేడాలేంటి?: 1. సీతాకోకచిలుక దిశ 2. ఎడమవైపు ఉన్న చెట్టు ఎత్తు 3. జెండా 4. మధ్యలోని బాబు చొక్కాపైన డిజైన్ 5. ఎడమ చివరన ఉన్న బాబు బూట్లు 6. ఉడతకు బదులుగా పిట్ట 7. రాయిపైన రాయి 8. కుడి చివరన ఉన్న బాబు చొక్కా రంగు.






సమీక్ష

అంతులేని తపన...

జీవితం అంటేనే బంధాల సమాహారం. ఊపిరి ఉన్నంత వరకూ మనం ప్రేమిస్తున్నవాళ్ల మంచి కోసం ఆరాటపడతాం. ఆ అంతులేని 'తపన' ఇతివృత్తంగా కన్నెగంటి అనసూయ అల్లిన ఏడు అనుబంధాల కథల సమాహారం ఈ పుస్తకం. 'ఎగసిన కల' కథలో మనవడి కోసం ఓ తాత తపన గుండెల్ని కరిగిస్తుంది. 'అతనెనవాడు'లో ముక్కూమొహం తెలియని మనిషి కోసం ఓ కుర్రాడి తపన ఆలోచింపజేస్తుంది.




'దస్తూరి'లో ఇల్లాలిని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలనుకునే సూరిబాబు తపన గొప్పగా అనిపిస్తుంది. అక్షరజ్ఞానం ఉన్నా లేకపోయినా, ఆ పాత్రల్లో అంతులేని సంస్కారం కనిపిస్తుంది. అట్టడుగు సమాజంలోని సరికొత్త కథానాయకుల్ని పాత్రలుగా పాఠకులకు పరిచయం చేశారు రచయిత్రి.

తపన (కథలు)
రచన: కన్నెగంటి అనసూయ
పేజీలు:120; వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

కల్లోల స్వప్నాలు

వచనంతో పోలిస్తే కవనం బాధ్యత పదిరెట్లు ఎక్కువ. ఆ కాసిన్ని పదాలతోనే చదువరిని కదిలించాలి. గుండెల్ని మెలితిప్పాలి. ఆర్ద్రత నింపాలి. అప్పుడే, ఆ కవితకు సార్థకత.



నాగజ్యోతి శేఖర్ 'చిగురించే పేజీలు' కవితా సంకలనంలో అ తడి పుష్కలం. పెళ్లి చేసుకుని వెళ్లిపోయాక కూడా పుట్టింట్లోని తన గదితో ఆడపిల్ల అనుబంధాన్ని 'అలిఖిత ఆస్తి' హృద్యంగా ఆవిష్కరించింది. 'భూమి మింగిన సూరీడు'లో 'అన్నం పండించే చేయి కంచం దగ్గరకు రాలేదు...' అనే అభివ్యక్తిలో ఎంత సున్నితత్వం! మరో కవితలో 'నదిని ఊరు చేస్తున్నప్పుడు... ఊరు నది అవ్వొచ్చు అన్న ఊహే రాలేదు' అని కుండ బద్దలు కొట్టేశారు. 'విచ్చుకోవడమే తెలియని మొగ్గపై... విచ్చుకత్తుల దాడి'నీ ఖండిస్తారు.

చిగురించే పేజీలు (కవిత్వం)
రచన: నాగజ్యోతి శేఖర్
పేజీలు: 177, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 8247843738

నడిచే పుస్తకాలు

ఈ పుస్తకం నిండా పరిపూర్ణ జీవితాల ప్రస్తావనలే. ఆఫ్రికన్ కవి బెన్ ఒక్రిని పరిచయం చేస్తూ... 'అలాంటి వాళ్లని చదువుతుంటే మన గ్రామానికెళ్లి అక్కడి మట్టి అరుగుల మీద



కూచుని వృద్ధులో, రైతులో, గృహిణులో చెప్పే సుద్దులు విన్నట్టుంటుంది' అని మురిసిపోతారు. సల్మాన్ రష్దీపైన హత్యాయత్నం గురించి చెబుతూ... 'పుస్తకాలు చదవని వాళ్లే రచయితలకు నిజమైన శత్రువులు' అని నిర్మొహమాటంగా చెప్పేస్తారు. మహాశ్వేతాదేవి, ఠాగూర్, అబ్దుల్ కలాం, నేతాజీ... ఇలా ఎన్నో వ్యక్తిత్వాలు అక్షరాలై మనకు తారసపడతాయి. ప్రతి వ్యాసం తర్వాతా, ఓ కాలాతీత వ్యక్తితో కరచాలనం చేసిన అనుభూతిని పొందుతాం.

ఉదార చరితులు
వారిది వసుధైక కుటుంబం
రచన: వాడ్రేవు చినవీరభద్రుడు
పేజీలు:184; వెల: రూ.250
ప్రతులకు: ఫోన్: 9866115655

ప్రతీకాత్మకంగా...

జయమోహన్ రచనలు కొన్నిసార్లు అర్థమయ్యీ కానట్టుగా ఉంటాయి. ఉద్దేశపూర్వకంగానే ఆయన ఈ సాహితీ వ్యూహాన్ని ఎంచుకుంటారేమో! అర్థమైతే అక్కడితో ఆగిపోతాం, అర్థం కాకపోతేనే పరిపరి విధాలుగా ఊహించుకుంటాం. మనదైన ముగింపును ఇచ్చుకుంటాం. పాఠకుడిలోని రచయితను మేల్కొలిపేవాడే అత్యుత్తమ రచయిత! 'మాడన్ మోక్షం' బడుగుల బస్తీలో వెలిసిన ఓ ప్రాచీన గ్రామ దైవం కథ. ఆ పేదల దేవుడిని సంస్కృత శ్లోకాలూ, వేదమంత్రాలూ కబళించిన తీరు... మన చుట్టూ జరుగుతున్న



భక్తి వ్యాపారాన్ని గుర్తు చేస్తుంది. 'తాళం చెవి' కథలో కోతిని ప్రతీకాత్మకంగా తీసుకుని మనిషి జీవితాన్ని మింగేస్తున్న యాంత్రికత గురించి హెచ్చరికలు చేస్తారు. 'పెద్దమ్మ మాటలు', 'యానం', 'సన్నటి నూలుపోగు' ...ఇలా సంకలనంలోని ప్రతి కథా ఓ కఠోర వాస్తవాన్ని ఎత్తి చూపుతుంది.

మాడన్ మోక్షం (ఇతర కథలు)
రచన: జయమోహన్
అనువాదం: అవినేని భాస్కర్
పేజీలు: 227, వెల: రూ.250
ప్రతులకు: ఫోన్: 9381559238

బుక్‌షెల్ఫ్

స్పర్శలేని శిల (కవిత్వం)
రచన: ఎన్.లహరి
పేజీలు: 120, వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

మన ప్రజాపాలన
(ప్రగతి వైపు తెలంగాణ పయనం)
రచన: ముచ్చర్ల దినకర్
పేజీలు: 140, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్ :9440704535

మార్మిక మానవ జాతులు
రచన: హెచ్.ఆర్. లక్ష్మి నారాయణ
పేజీలు: 161, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 8522002536

హరప్పా నుంచి నేటి వరకు
(చరిత్ర వ్యాసాలు)
రచన: బొల్లోజు బాబా
పేజీలు: 240, వెల: రూ.275
ప్రతులకు: ఫోన్: 9866115655

మేలిమి (సప్తపదుల పంచశతి)
సృజన: సుధామ
పేజీలు: 147, వెల: రూ.250
ప్రతులకు: ఫోన్: 9849297958

నా జీవితం... నల్లేరు మీద బండి
రచన: సాకం నాగరాజు
పేజీలు: 127, వెల: రూ.100
ప్రతులకు: ఫోన్: 9440331016

నేనేం చేశాననీ...
(కవితా-కథా సంపుటి)
రచన: రూపాకృష్ణ
పేజీలు: 163, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9440331016

డాక్టర్ కపిలవాయి లింగమూర్తి
సాహిత్యానుశీలనం
అంతర్జాతీయ సదస్సు పత్రాలు-1
పేజీలు: 328, వెల: రూ.400
అంతర్జాతీయ సదస్సు పత్రాలు-2
పేజీలు: 315, వెల: రూ.400
సంపాదకులు: కె.కృష్ణమూర్తి
ప్రతులకు: ఫోన్: 8500167842

అప్పిచ్చివాడు వైద్యుడు
రచన: చింతపల్లి గిరిజా శంకర్
పేజీలు: 176, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 8558899478

రాశి ఫలం

గ్రహబలం
(డిసెంబరు 7 - 13)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఆర్థికంగా లాభదాయకం. ఉద్యోగ, వ్యాపారాల్లో ముఖ్య నిర్ణయాలను వాయిదా వేయకండి. మరింత ఏకాగ్రత అవసరం. బంధుమిత్రులతో ఆచితూచి వ్యవహరించాలి. ప్రయాణాలు పెద్దగా ప్రయోజనకరం కాకపోవచ్చు. సమయాన్ని సద్వినియోగం చేసుకోండి. మిత్రుల సాయం అందుతుంది. సూర్యుడిని ధ్యానించండి.



వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

శుభయోగాలు ఉన్నాయి. లక్ష్యాలను సాధిస్తారు. శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. మరింత ఆత్మవిశ్వాసంతో వ్యవహరించండి. చెడును ఊహించకండి. వ్యాపారంలో ముందుచూపు అవసరం. నష్టాలను నివారించే ప్రయత్నం చేయండి. శని కార్యసిద్ధిని ప్రసాదిస్తాడు. దైవబలం పెరుగుతుంది. సూర్యుడిని ఆరాధించండి.



మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

అత్యుత్తమ కాలమిది. వ్యాపార ఫలితాలు శుభప్రదం. జీవితంలో అభివృద్ధి గోచరిస్తోంది. ఆర్థికంగా మిశ్రమ ప్రయోజనాలు ఉంటాయి. వృథా ఖర్చులకు కళ్లెం వేయండి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోవద్దు. ఆత్మీయుల సలహాలు తీసుకోండి. కుటుంబ సభ్యుల సహకారం అందుతుంది. ఆరోగ్యం పరిపూర్ణంగా సహకరిస్తుంది. ప్రయాణాల్లో జాగ్రత్త. గురు ధ్యాన శ్లోకాలను పఠించండి.



కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

పంచమ శుక్రబలంతో మంచి ఫలితాలు ఉంటాయి. కష్టానికి తగిన లాభం ఉంటుంది. ముఖ్య కార్యక్రమాల్లో మిశ్రమ ఫలితాలు అందుతాయి. మానసికంగా ఇబ్బందులు సృష్టించేవారితో జాగ్రత్త. ఆత్మబలాన్ని తగ్గించే సంఘటనలకు దూరంగా ఉండండి. లక్ష్యాలను పూర్తి చేస్తారు. సామరస్యంగా వ్యవహరించండి. నవగ్రహ శ్లోకాలను చదువుకోండి.



సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

అదృష్టయోగం సూచితం. ప్రారంభించిన పనులన్నీ పూర్తవుతాయి. ఈవారం అన్ని విధాలుగా లాభదాయకం. వ్యాపారాన్ని మరింత విస్తరిస్తారు. కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఉంది. సమాజంలో మంచిపేరు సంపాదిస్తారు. చంచల స్వభావం వద్దు. లోతుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. పరమశివుడిని ఆరాధించండి.



కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

అదృష్టం వరిస్తుంది. ప్రారంభించిన పనులు పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగాల్లో సానుకూల ఫలితాలు ఉంటాయి. దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటారు. మనోధైర్యాన్ని పెంచుకోండి. ఆర్థిక ప్రయోజనాలు సూచితం. వేడుకల్లో పాల్గొంటారు. తృతీయ శుక్రబలం అనుకూలం. విష్ణువును పూజించండి.



తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపార ప్రయోజనాలు అత్యుత్తమం. ప్రయత్నాలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా ఆలోచించండి. గ్రహబలం సహకరిస్తుంది. భాగ్య బృహస్పతి యోగం దైవబలాన్ని ప్రసాదిస్తుంది. గృహ నిర్మాణం కొలిక్కి వస్తుంది. చక్కని ప్రణాళికతో ఆటంకాలు దూరం అవుతాయి. సర్దుబాటు మనస్తత్వం తప్పనిసరి. వారాంతంలో శుభవార్త వింటారు. సూర్యుడిని ఉపాసించండి.



వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఆదాయాన్ని పెంచుకుంటారు. విజయానికి చేరువ అవుతారు. ముఖ్య కార్యక్రమాల్లో మిశ్రమ ఫలితాలు లభిస్తాయి. ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. అష్టమ గురువు పెద్దగా అనుకూలించడం లేదు కాబట్టి, అనవసర వివాదాలు వద్దు. ప్రయాణాల్లో జాగ్రత్త. నవగ్రహ ధ్యాన శ్లోకాలను పఠించండి.



ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఆశయాల సాధనకు బలమైన ప్రయత్నం అవసరం. దైవబలం అనుకూలిస్తుంది. ఆర్థిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. నలుగురిలోనూ మంచి పేరు తెచ్చుకుంటారు. బద్ధకాన్ని దూరంగా ఉంచండి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండండి. మొహమాటం వల్ల ఖర్చులు పెరిగే ఆస్కారం ఉంది. దుబారా వద్దు. ఈశ్వరుడిని ఆరాధించండి.



మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

గ్రహబలం శుభప్రదం. మంచికాలం కొనసాగుతుంది. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తవుతాయి. వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటారు. ఉద్యోగులు శుభవార్త వింటారు. బుద్ధిబలంతో అనుకున్నది సాధిస్తారు. ఆరోగ్యం సహకరిస్తుంది. పెట్టుబడులు లాభాలను కురిపిస్తాయి. మహాలక్ష్మిని పూజించండి.



కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

అదృష్టం వరిస్తుంది. ఉద్యోగంలో ఉత్తమ ఫలితాలు ఉంటాయి. అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటారు. భవిష్యత్తు శుభప్రదం. దైవబలం తోడవుతుంది. వ్యాపార అభివృద్ధికి బలమైన ప్రయత్నం అవసరం. కలహాలకు తావివ్వకండి. కుటుంబ సభ్యుల సలహాలను స్వీకరించండి. వారాంతంలో శుభవార్త వింటారు. ఈశ్వరుడిని ఆరాధించండి.



మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

భాగ్య శుక్రబలం ఆర్థికంగా మేలు చేస్తుంది. అవసరాలకు డబ్బు అందుతుంది. ఆర్థికంగా మరింత ప్రగతిని సాధిస్తారు. ఉద్యోగంలో క్రమశిక్షణతో పనిచేయాలి. తప్పుదోవ పట్టించేవారితో జాగ్రత్త. అర్థంలేని ఆరోపణల్ని పట్టించుకోకండి. ఆటంకాలను తెలివిగా ఎదుర్కొంటారు. అస్థిరమైన నిర్ణయాలు తీసుకోకండి. నవగ్రహాల్ని ధ్యానించండి.

పదకేళి

కూర్పు: బాలు

అడ్డం

1. పెదవి (3)
3. దోసిలి (3)
5. నిబంధన లాంటిది (2)
8. పన్నెండో నెల (4)
11. వక్రం (3)
13. వేరు చేసేది- కత్తెర; కలిపి కుట్టేది- ? (2)
14. వణికించేది (2)
15. అన్నకణం (3)
17. క్షమించండి (2)
18. పెనం మీద వేసేది, ఆ విధంగా (2)
19. వేరే నామధేయం (4)
21. అసంపూర్ణ సత్యం (2)
22. మేకు (2)
23. కల్యాణం (4)
25. వెయ్యి గ్రాములు (2)
27. బాసతో దాసి (3)
29. సొమ్ము (2)
31. ఆర్భాటం (3)
33. నైరుతి అక్షరం కోల్పోతే ధ్వని (2)
35. ముగింపులేని ప్రగతి (2)
36. కర్ణం (2)
39. ఖడ్గం (4)
41. కరెన్సీ కాగితాలు (2)
42. కండ ఊడివచ్చేలా కుట్టే చీమ (4)
43. విపత్తు, యాక్సిడెంట్ (3)
45. అమ్మ నుదుట బొట్టు (3)
46. చూడం (2)
49. భూమి (2)
50. అక్కడున్నవాడు (3)
52. దుర్మార్గుడు (3)
53. భద్రం, కుశలం (3)
54. నరుడు (4)

1		2	■	3	4		■	5	6	■	7
	■	8	9			■	10	■	11	12	
13		■	14		■	15		16	■		■
	■	17		■	18		■	19	20		
■	21		■	22		■	23				■
24	■	25	26	■	27			■		■	28
29	30	■	31	32		■	33	34	■	35	
■	36	37	■		■	38	■	39			
40	■	41		■	42				■		■
43	44		■	45			■	46	47	■	48
49		■	50			■	51	■	52		
	■	53			■	54				■	

నిలువు

1. అత్రి మహర్షి భార్య (4)
2. లోనికి దయచేయండి (2)
3. పిండితో నూకలతో వండేది (3)
4. 'డేం' చేరిస్తే ప్రమాదం (2)
6. శబ్దం (2)
7. మద్యం (2)
9. వంద పరుగులు (3)
10. బిడ్డలు (2)
12. చెవులకింపు (4)
15. సోపానాలు (2)
16. పెళ్ళి కాని యువతి (3)
17. కృష్ణుడి అనుయాయి (3)
18. అమెరికాలో ఒక రాష్ట్రం (4)
20. అప్పే (3)
23. ఆకుల రసం (3)
24. తమరి మీద (2)
26. మెటల్ (2)
28. వేపుడు చట్టి (3)
30. చేను చుట్టూ రక్షణ కోసం వేసేది? (2)
32. కత్తి దెబ్బకు అయినది (2)
34. గజిబిజి (4)
35. పగడం (3)
37. ప్రేక్షకుల్ని అలరించడానికి ఉద్దేశించిన ప్రదర్శన (3)
38. లెఫ్ట్ (3)
40. అంతగా ప్రాముఖ్యం లేనిది (4)
42. మారువేషంలో ధర్మరాజు (3)
44. మాత్రిక మూడింట రెండొంతులు (2)
45. వెంట్రుక, రోమం (3)
47. యశోద భర్త!? (3)
48. వ్యవధి (3)
50. ఇది కాదు (2)
51. లోపల (2)

సుడొకు

	9	7		8		1		
		4	2				7	
6		3	1					4
7			9					5
8		9		4		2		7
4					1			6
9					6	3		1
	7				9	5		
		6		1		7	8	

గతవారం సమాధానాలు

పదకేళి

1 ఈ	గ	❀	2 దా	❀	3 నె	4 పం	❀	5 పో	❀	6 లం	❀
శ్వ	❀	7 చె	ర	8 కు	❀	9 చ	10 రా	చ	11 రం	❀	12 ఫ
13 రు	మా	లు	❀	14 రు	ణ	దా	త	❀	15 గ	16 సా	లు
డు	❀	17 వ	18 గ	లు	❀	ర	❀	19 అ	వ	గు	ణం
❀	20 ఐ	❀	ట్టు	❀	21 అ	❀	22 అ	❀	ల్లి	❀	❀
24 ప	దు	ను	❀	25 అ	ప	న	మ్మ	26 కం	❀	27 ప	28 ది
❀	గు	❀	29 క	❀	రా	❀	30 కు	సు	మం	❀	గు
31 పె	రు	32 గు	❀	33 వి	జి	త	❀	డు	❀	34 చా	లు
శ్మి	❀	35 స	చ్ఛ	రి	త	❀	36 ప్ర	❀	37 చెం	ప	❀
❀	38 వే	గు	❀	వి	❀	39 వి	భు	డు	❀	40 కూ	ర్మి
41 ద	ళ	స	రి	❀	42 అ	రు	వు	❀	43 తా	డు	❀
మ్మ	❀	లు	❀	44 స	న్న	ద్ధం	❀	45 ఆ	లు	❀	46 న్యు

సుడొకు

6	7	1	2	9	3	5	4	8
9	2	5	8	4	6	3	1	7
3	8	4	1	7	5	2	9	6
1	4	3	7	8	2	9	6	5
8	5	7	9	6	4	1	2	3
2	9	6	5	3	1	7	8	4
4	3	2	6	1	7	8	5	9
7	1	9	4	5	8	6	3	2
5	6	8	3	2	9	4	7	1












పచ్చటి చెట్లలో... పక్షి గూళ్లలో!

గజిబిజి జీవితానికి దూరంగా వెళ్లి సేదతీరడమంటే కేవలం పచ్చటి చెట్ల నడుమ గడిపితే సరిపోతుందా... ఆస్వాదించే ఆ పరిసరాలన్నీ కూడా పూర్తిగా ప్రకృతి ఒడినే తలపించాలి కదా! ఇదిగో ఆ అనుభూతిని పొందాలనుకునే పర్యటకుల భూతల స్వర్గమే థాయ్‌లాండ్‌లోని 'కీమల లగ్జరీ జంగిల్ రిసార్ట్'. సముద్ర తీరాన, కొండల అంచున కొలువుదీరిందీ ఫైవ్‌స్టార్ హోటల్. పచ్చదనంతో నిండిన ఆ ప్రదేశంలో రిసార్టు విల్లాలూ మమేకం అవ్వాలన్న ఆలోచనతో ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. 'క్లే పూల్ కాటేజ్, టెంట్ హౌజ్, ట్రీ హోమ్, బర్డ్‌నెస్ట్ హోటల్' థీమ్‌లతో ఆకట్టుకుంటాయి విల్లాలన్నీ. అంతేనా... లోపల ఈత కొలను మొదలు అన్ని రకాల సౌకర్యాలూ ఉంటాయి. ఇంత అందంగా, ఆహ్లాదకరంగా ఉంటే- సందర్శకులకు నచ్చకుండా ఉంటుందా... అందుకే ఈ నేచర్ లవర్స్ స్పాట్‌లో ఒక్కపూటైనా గడిపి తీరాలంటూ బారులు కడతారు!









అదాటున ఈ ఫొటోని చూడగానే చిన్న మెలికల ముగ్గులా అనిపించట్లేదూ! ట్రాఫిక్‌ను తగ్గించడం కోసం మహానగరాల చుట్టూ రింగ్‌రోడ్లనీ, ఇంటర్ చేంజింగ్ దారుల్నీ వేస్తుంటారు. అలా ఇండోనేషియాలోని జకార్తాలో నిర్మించిన సెమాంగి రోడ్డు ఇది. ఇంజినీరింగ్ అద్భుతంగా చెప్పే ఈ దారి- నగరం నలుదిక్కుల రోడ్లనీ కలుపుతుంది. ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఈ దారుల్లో రోజూ లక్షలాది వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రివేళ ఎల్ఈడీ కాంతుల్లో మెరిసిపోయే ఈ రోడ్డు నగరానికే ల్యాండ్‌మార్క్‌గా పేరు తెచ్చుకుంది.